ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు

యథేచ్ఛగా నకిలీలు

- మార్కెట్‌లోకి కల్తీ పత్తి విత్తనాలు
- రెండేళ్లుగా నిండా మునిగిన రైతులు
- తనిఖీలు చేపట్టని అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లాలో మార్కెట్‌లోకి యథేచ్ఛగా కల్తీ పత్తి విత్తనాలు వచ్చి చేరుతున్నాయి. జిల్లాలో కల్తీ విత్తనాల వల్ల రైతులు గత రెండేళ్లుగా నిండా మునిగారు. అయినా అధికారులు తనిఖీలు చేపట్టడం లేదు. దీంతో పత్తి రైతుల భవిష్యత్తు ఈ ఏడాది కూడా ప్రశ్నార్థంగా మారింది...

గత రెండేళ్లుగా నకిలీ పత్తి విత్తనాలు రైతులకు నష్టాలను మిగిల్చాయి. కర్నూలు జిల్లాలో పత్తి సాధారణ సాగు 6.11 లక్షల ఎకరాలు కాగా సాధారణ సాగుకు మించి 6.46 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. దీన్ని ఆసరాగా తీసుకున్న కొన్ని పత్తి విత్తనాల కంపెనీలు కల్తీ విత్తనాలను యథేచ్ఛగా అమ్మి సొమ్ము చేసుకున్నాయి. దిగుబడులు లేకపోవడంతో రైతులు నష్టాలను చవిచూశారు. కర్నూలు డివిజన్‌లో 1.02 లక్షల ఎకరాల్లో, ఆదోని డివిజన్‌లో 1.40 లక్షలు, ఎమ్మిగనూరు డివిజన్‌లో 1.29 లక్షలు, ఆలూరు డివిజన్‌లో 1.35 లక్షలు, పత్తికొండ డివిజన్‌లో 1.35 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. నకిలీ విత్తనాల దాటికి 5 లక్షల ఎకరాలకు పైగా పంట నష్టపోయింది. సూపర్ కాటన్, జంగి, ఆదిత్య, అఖిర, తడాకా, సూపర్, వింధ్య, లయన్, స్టాలిన్, 3228, కిలాడీ, 429 సూర్య, బిగ్‌బాస్, రాధిక, బిజి 2 వంటి 30 రకాల కంపెనీల విత్తనాలను కొని పంట దిగుబడి రాకపోవడంతో రైతులు నష్టపోయారు. కోట్లల్లో రైతుల పెట్టుబడి మట్టిపాలైంది. మరో వైపు కల్తీ పత్తి విత్తనాల రాక ఆరంభమైంది. కల్తీ విత్తనాలు యథేచ్ఛగా మార్కెట్‌లోకి వచ్చి చేరుతున్నారు. నకిలీ, కల్తీ విత్తనాలపై దృష్టి సారించాల్సిన వ్యవసాయశాఖ, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టడం లేదు. జిల్లా పునర్విభజనలో నేపథ్యంలో తనిఖీలు చేసేందుకు సిబ్బంది కొరత ఉందని సాకుగా చెబుతున్నారు. ఏప్రిల్ నుంచే వ్యవసాయాధికారులు బృందాలుగా ఏర్పడి విత్తన శుద్ధి కేంద్రాల్లో తనిఖీలు చేయాల్సి ఉండగా ఆ ఊసే లేకుండా పోయింది. బిటి విత్తనాలకు సంబంధించి కో మార్కెటింగ్ లేకపోవడంతో సెంట్రల్ సీడ్ లైసెన్సు కలిగిన కంపెనీలకు చెందిన రకాలతో వివిధ కంపెనీలు ఆయా బ్రాండ్లతో బిటి పత్తి విత్తనాలను సిద్ధం చేస్తున్నాయి. కొన్ని కంపెనీల పేర్లతో కల్తీ విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చి చేరుతున్నాయి.

వ్యవహారం సాగుతుందిలా...

పత్తి పంట చేతికందాకా విత్తనాలను రైతుల దగ్గర నుంచి కొందరు దళారులు సేకరించుకుంటారు. జిల్లాలో జిన్నింగ్ మిల్లులు ఎక్కువగా ఉన్న నంద్యాల ప్రాంతం నుంచే ఈ వ్యవహారం మొదలవుతుంది. ఎలాంటి అనుమతులూ లేకున్నా పట్టణాల్లో వివిధ పేర్లతో ఉన్న ప్యాకెట్లలో, గ్రామాల్లో లూజు విత్తనాల పేరుతో ఈ విక్రయాలు సాగుతాయి. తక్కువ ధరతో నాణ్యమైన దిగుబడి వస్తుందంటూ రైతులకు ఆశ చూపుతారు. అయితే కొన్ని విత్తనాలకు రసీదులు మాత్రం ఇవ్వరు. అలా నమ్మి సాగు చేసిన రైతులు పొలాల్లో దిగుబడి సరిగ్గా రాకపోవడంతో నిర్ఘాంతపోతారు. తీరా తాము మోసపోయామని తెలుసుకున్న రైతులు విక్రయదారులను ప్రశ్నిస్తే భూమి సరిగ్గా లేదనో, నీరు సరిగ్గా అందలేదనో సాగులు చెప్పి ప్లేటు మార్చేస్తారు. జిల్లాలో కొన్నేళ్లుగా ఇదే తంతు సాగుతున్నా అధికారులు మాత్రం ప్రత్యేక దృష్టి సారించడం లేదు. జిల్లాలోని ఆదోని, ఎమ్మిగనూరు, సి.బెళగల్, మంత్రాలయం ప్రాంతాల్లో ఈ నకిలీ విత్తన వ్యాపారాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

కావాలంటే అప్పులూ ఇస్తారు..

నకిలీ విత్తనాల వ్యవహారంలో రైతులకు అప్పు ఆశ కూడా చూపిస్తారు. తమ దగ్గర విత్తనాలు కొంటే అప్పుగా ఇస్తారు. అప్పుకు సంబంధించి ప్రాంసరీ నోటును ఖచ్చితంగా రాయించుకుంటారు. పంట చేతికి రాక నష్టాల్లో కూరుకుపోయినా రైతు నుంచి ముక్కు పిండి మరీ డబ్బును వసూలు చేస్తారు. ఇలా నకిలీ వ్యవహారంలో రైతులు అప్పులపాలు కూడా అవుతున్నారు.

ఆశావర్కర్లకు పని భారం తగ్గించాలి

- డిఎంఅండ్ హెచ్ఓ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఆశా వర్కర్లపై పని భారం పెంచుతున్న ప్రభుత్వం వేతనాలు పెంచడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు పేర్కొన్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం ఆశాలు జిల్లా నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో తరలివచ్చి జిల్లా అధ్యక్షులు శివలక్ష్మి అధ్యక్షతన డిఎంహెచ్ఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎండి అంజిబాబు, జిల్లా నాయకులు ఎం.గోపాల్, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శ రమీజాబి, సిఐటియు నాయకులు మారెళ్ళ విజయ్, సిహెచ్.సాయి బాబాలు మాట్లాడారు. ఆశా వర్కర్లు చాలాకాలంగా వేతనాల పెంపుదల కోసం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం పెరిగిన పని భారం తగ్గించాలని కోరుతున్నా ఏ ఒక్క సమస్య ప్రభుత్వం పరిష్కరించడం లేదని అన్నారు. ఆశ వర్కర్లపై అధికారుల వేధింపులు చాలా తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. ఎఎన్ఎంలు చేయాల్సిన 9 యాప్‌ల ఆపరేటింగ్ ఆశ వర్కర్లను బెదిరించి పని చేయించుకుంటూ వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఆశా వర్కర్ల పై సచివాలయ సిబ్బంది వేధింపులకు పాల్పడుతున్నారని అన్నారు. అనారోగ్యానికి గురైనా సెలవులు మంజూరు చేయకుండా పని చేయించుకుంటున్నారని తెలిపారు. మెటర్నిటీ లీవులు, మెడికల్ లీవులు, పండుగ సెలవులు, ఏవీ వారికి వర్తింప చేయడం లేదని అన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు ప్రభుత్వం ఇస్తున్న రూ.పదివేల జీతం సరిపోవడంలేదని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం 2జి సిమ్ములు ఇవ్వడం వలన యాప్‌లు సరిగ్గా పనిచేయడం లేదని, నెట్వర్క్ లేని చోట ఆశ వర్కర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఎఎన్ఎంలు బెదిరింపులకు గురి చేస్తున్నారని, జీతంలో కోత విధిస్తున్నారని తెలిపారు. నాణ్యమైన సెల్ ఫోన్లు ఫోర్ జి సిమ్ములు ఇస్తే తాము పనిచేయడానికి వెనకాడమని అన్నారు. ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే రానున్న కాలంలో మరిన్ని ఉద్యమాలకు సిద్ధమవుతామని, ప్రభుత్వం దిగి రాకపోతే నిరవదిక క సమ్మెకు కూడా వెనుకాడమని సిఐటియు నాయకులు హెచ్చరించారు. అనంతరం ముట్టడి కార్యక్రమం చేస్తున్న ఆశ వర్కర్ల దగ్గరకు డిఎం అండ్ హెచ్ఓ వచ్చి సిఐటియు ప్రతినిధుల బృందం ఇచ్చిన వినతిపత్రాన్ని తీసుకున్నారు. ఆశాల ను ఉద్దేశించి డిఎంహెచ్ఓ రామ గిడ్డయ్య మాట్లాడుతూ ఆశా వర్కర్ల పై వేధింపులు చేసిన మెడికల్ ఆఫీసర్లు ఎఎన్ఎంల పేర్లు వివరాలు సమర్పిస్తే డిపార్టుమెంట్ గా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తన పరిధిలో లేని డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామని, సభా ముఖంగా తెలిపారు. వేధింపులు ఎక్కడున్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ ముట్టడి కార్యక్రమంలో ఆశా వర్కర్ల లీడర్లు రాధా, శేషమ్మ, మాధవి ,సుబేదా, త్రివేణి, శోభారాణి పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

జగనన్న తోడు కింద 20,516 మందికి లబ్ధి

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

చిరు వ్యాపారులకు జగనన్న తోడు ద్వారా ఆర్థిక చేయూత ఇవ్వాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న తోడు పథకం 7వ విడతలో జిల్లాలోని 20,516 మంది లబ్ధిదారులకు రూ.57.01 లక్షలు (రూ.37.45లక్షలుంరూ.19.56లక్షలు) వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. మంగళవారం జగనన్న తోడు పథకం 7వ విడత రుణాల మంజూరును రాష్ట్ర ముఖ్యమంత్రి లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ , ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, డాక్టర్ జె.సుధాకర్, బీసి కార్పొరేషన్ డైరెక్టర్ సాయినాథ్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న తోడు పథకం ద్వారా 7వ విడతలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో 13,476 మంది లబ్ధిదారులకు రూ.37.45లక్షలు, పట్టణ ప్రాంతంలో 7,040 మంది లబ్ధిదారులకు రూ.19.56లక్షలు మొత్తంగా 20,516 మంది లబ్ధిదారులు జగనన్న తోడు ద్వారా లబ్ధి పొంది సకాలంలో చెల్లించిన వారికి వడ్డీ రాయితీ రూపంలో రూ.57.01 లక్షలు లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం జమచేసిందన్నారు. చిరు వ్యాపారులు వడ్డీల ఊబిలో చిక్కుకోకుండా వడ్డీ భారం పూర్తిగా ప్రభుత్వమే భరిస్తూ వారికి అన్ని విధాలా తోడుగా నిలబడేందుకు జగనన్న తోడు పథకాన్ని లబ్ధిదారులకు చేయూతను ఇస్తుందని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు గ్రామీణ ప్రాంతంలోని 13,476 మంది లబ్ధిదారులకు రూ.37.45లక్షలు, పట్టణ ప్రాంతాలలోని 7,040 మంది లబ్ధిదారులకు రూ.19.56లక్షల మెగా చెక్కును అందజేశారు. డిఆర్‌డిఎ ఇంఛార్జి పిడి , మెప్మా పిడి నాగశివలీల, ఎపిడి శ్రీధర్ రావు, ఎల్‌డిఎం రామచంద్ర రావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

31న కలెక్టరేట్ ముట్టడి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి
- సిపిఎం ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ప్రచారం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజా సమస్యలు పరిష్కరించాలని, జిల్లాను సర్వతోముఖాభివృద్ధి చేయాలని, అందుకు రూ.పదివేల కోట్లు కేటాయించాలని ఈనెల 31న నిర్వహించే కర్నూలు జిల్లా కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి ప్రజలను కోరారు. మంగళవారం కర్నూలు నగరంలోని, మండిబజారు, మాసంబాష దర్గా ఏరియా, ఉస్మానియా కాలేజ్‌రోడ్, పెద్దపడఖానా, బేకార్‌కట్ట ,కవ్వాడిగేరి, గరీబ్‌నగర్, గడ్డ, ప్రాంతాలలో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా గౌస్ దేశాయి మాట్లాడుతూ జిల్లాలోని ప్రాజెక్టుల నిర్మాణం కోసం రూ. 8 వేల కోట్లు ఇవ్వాలని, పెరిగే నిత్యవసర వస్తువుల ధరలను కూరగాయల ధరలను తగ్గించాలని కోరారు. పెంచిన కరెంట్ ,ఆర్టీసీ చార్జీలను, ఇంటి పన్నులను ,చెత్త పన్నును రద్దు చేయాలనే డిమాండ్లతో ఈ నెల 26వ నుండి, 31 వరకు ఆదోని నుండి కర్నూలు వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ,కార్మికులు తమయొక్క మద్దతు తెలియజేసి, సిపిఎం చేపట్టబోయే ఆందోళన పోరాటాలలో ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు అబ్దుల్ దేశాయి అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు, వివిధ సర్కిల్లో ప్రసంగించారు.

పాదయాత్రనుద్దేశించి మాట్లాడుతున్న గౌస్‌దేశాయి

కెసి ద్వారా రెండు పంటలకు సాగునీరివ్వాలి: సిపిఎం

కర్నూలు క్రైమ్ : కర్నూలు మండల అభివృద్ధి జరగాలన్న వలసలు నివారించాలన్న రైతులకు కెసి కెనాల్ ద్వారా రెండు పంటలకు సాగునీరు అందించాలని సిపిఎం కర్నూలు మండల కార్యదర్శి ఉసేనయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండవ రోజు కర్నూలు మండల అభివృద్ధి కోరుతూ జరుగుతున్న జీపు జాతను కర్నూలు మండల పరిధిలోని అంబేద్కర్ నగర్‌లో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కర్నూలు మండలంలోని అనేక గ్రామాలు పొట్ట చేత పట్టుకుని గుంటూరు ప్రాంతాల బతకడానికి వెళుతున్నారని చెప్పారు. వారికి ఉన్నచోటే ఉపాధి కల్పించాలని, దానికోసం ఉపాధి హామీ పథకం 200 రోజులు పెంచాలని, రైతులకు రెండు పంటలకు సరిపడా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

జీపు జాతా దిన్నదేవరపాడు, పసుపల, రుద్రవరం, నూతనపల్లె, నందనపల్లె, పడిదంపాడు, శివరాంపురం, దిగువపాడు, గార్గేయపురం గ్రామాలలో పర్యటించింది. రుద్రవరం, పడిదంపాడు పూడూరు గ్రామాలకు వెంటనే రోడ్డు వేయాలని, నందనపల్లె గ్రామానికి స్మశాన వాటికను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ గ్రామాల్లో మంచినీటి సరఫరా ప్రతిరోజు కల్పించాలని , డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని, సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. సిపిఎం మండల నాయకులు ఆంజనేయులు, రాఘవేంద్ర, శ్రీరాములు, మత్యున్ దేవ్, నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాముడు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా ,ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి రాజు, జిల్లా నాయకులు బతకన్న, రంగన్న , వెంకటేశ్వర్లు, జమ్మన్న లాలెస్ పాల్గొన్నారు.

పాదయాత్రనుద్దేశించి మాట్లాడుతున్న రాఘవేంద్ర

విద్యాశాఖ జెడిఎస్ మువ్వారామలింగంను కలిసిన యుటిఎఫ్ నాయకులు

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు, జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్ అన్నారు. కర్నూలుకు విచ్చిన విద్యాశాఖ జెడి సర్వీసెస్ మువ్వా రామలింగంకు యుటిఎఫ్ ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించింది. కర్నూలు జిల్లాకు భారీ సంఖ్యలో స్కూల్ అసిస్టెంట్ , హెడ్మాస్టర్ పోస్టులు మంజూరు చేసి, బదిలీలు పదోన్నతులను విజయవంతంగా చేపట్టినందుకు కతజ్ఞతలు తెలిపారు బదిలీలు , పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల జీతాల సమస్యలు పరిష్కరించాలన్నారు.యుటిఎఫ్ ఆర్థిక కార్యదర్శి హేమంత్ కుమార్, గౌరవాధ్యక్షుడు మారెప్ప, జిల్లా కార్యదర్శి నవీన్ పాటీ, జిల్లా నాయకులు హనుమంతు పాల్గొన్నారు.

కెడిసిసి బ్యాంక్ ఛైర్మన్‌గా విజయ మనోహరి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు జిల్లా కో అపరేటివ్ సహకార సొసైటీ బ్యాంక్ (కెడిసిసిబి) ఛైర్మన్ గా కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి.మోహన్ రెడ్డి సతీమణి ఎస్‌వి విజయ మనోహరిని నియమిస్తూ అగ్రికల్చర్ మార్కెటింగ్ సహకార సొసైటీ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి మంగళవారం ఎత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 జిల్లాల్లో సహకార సొసైటీలకు కొత్త ఛైర్మన్‌లను నియమించారు. అందులో భాగంగా కర్నూలుకు నూతన ఛైర్మన్‌గా విజయమనోహరిని నియమించారు. ఈ నియామకం ఆరునెలల పాటు అంటే వచ్చే ఏడాది జనవరి 17 వరకు ఉండనున్నట్లు జిఒలో పేర్కొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్

నాటుసారాపై దాడులు, అనుమానస్పద వ్యక్తుల ఇళ్లల్లోసోదాలు

డిఎస్‌పి విజయ శేఖర్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : జిల్లా ఎస్పీ జి. కష్ణకాంత్ ఆదేశాల మేరకు శాంతిభద్రతలపై జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేసి నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కర్నూలు సబ్ డివిజన్ పోలీసులు స్పెషల్‌పార్టీ పోలీసులు బృందాలుగా ఏర్పడి మంగళవారం తెల్లవారు జామున కర్నూలు డిఎస్‌పి విజయశేఖర్ సమక్షంలో కర్నూలు తాలుకా సిఐ శ్రీరామ్ ఆధ్వర్యంలో పసుపలలో కార్డెన్‌సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పసుపల గ్రామ ప్రజలతో డిఎస్‌పి మాట్లాడారు. నాటుసారా జోలికి పోకూడదని, ఏవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చ రించారు. ఈ దాడులలో 1200 లీటర్ల నాటు సారా ఊటను ధ్వంసం చేశారు. సరైన ధృవ పత్రాలు లేని 16 ద్విచక్ర వాహనాలు, 50 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. కర్నూలు తాలుకా సిఐ శ్రీరామ్ , ఎస్ఐ బాల నరసింహా, రామకృష్ణ, 50 మంది పోలీసు, స్పెషల్ పార్టీ పోలీసు బృందాలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత బ్యాగులను పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ,

ప్లాస్టిక్ పర్యావరణానికి ప్రమాదం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి ప్రమాదమని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్‌శంకర్ శర్మ సూచించారు. మంగళవారం కల్లూరు మండలం దూపాడు గ్రామ పరిసర ప్రాంతంలోని కెవి.సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో డాక్టర్‌శంకర్ శర్మ ప్లాస్టిక్ రహిత బ్యాగులను పంపిణీ చేస్తూ విద్యార్థులలో అవగాహన కల్పించారు. ఆయన మాట్లా డుతూ ప్లాస్టిక్‌ను తగుల బెడితే డయాక్సిన్లు, ప్యూరాన్లు అనే క్యాన్సర్ కారక వాయువులు వెలువడుతున్నాయని తెలిపారు. ప్లాస్టిక్ రసాయన గర్ధాలు, పర్యావరణ మార్పుల వల్ల భూసార క్షీణతకు గురవుతుందన్నారు. మానవాళితోపాటు ఇతర జీవుల మనుగడకు పర్యావరణ పరిరక్షణ ఎంతో కీలకమని, ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించడం వల్ల పర్యావరణాన్ని కాపాడిన వారవుతారని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, కుంటలు చెరువులు నదులు సముద్రాల్లోకి చేరుతున్నాయన్నారు. ప్లాస్టిక్ రసాయన వ్యర్థాలు పర్యావరణ మార్పుల కారణంగా భారత్ ప్రధానంగా క్షీణితకు గురవుతుందని, కాలక్రమంలో నీరు,వాయు కాలుష్యానికి తోడు రసాయన వ్యవసాయం, తవ్వకాలవంటి వంటిమానవచర్యలతో భూసారం క్షీణి స్తోందన్నారు. కెవి సుబ్బారెడ్డి విద్యాసంస్థల ఛైర్మన్ కెవి సుబ్బారెడ్డి మాట్లా డుతూ ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, పర్యావరణాని కాపాడాలని కోరారు.

బదిలీ అయిన విఆర్‌ఒలకు సన్మానం

ప్రజాశక్తి-తుగ్గలి

మండలం పరిధిలోని బొందిమడుగుల, మారెళ్ళ తదితర గ్రామాలలో పనిచేస్తున్న విఆర్‌ఒలు రాజ్ కుమార్ నాయక్, రేష్మ ఇతర ప్రాంతాలకు బదిలీ కావడంతో మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో రెవిన్యూ సిబ్బందిని సన్మానించారు. తహశీల్దార్ రవి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, విధుల్లో ఉన్నంతకాలం ప్రజల మన్ననలను పొందాలన్నారు. సేవలు చేయడానికి ఇతర ప్రాంతాలకు ప్రభుత్వం బదిలీ చేస్తుందన్నారు. డిప్యూటీ తహశీల్దార్ నిజాముద్దీన్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, మండల సర్వేయర్ గాది లింగప్ప, విఆర్‌ఒల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేంద్ర, మండల కమిటీ అధ్యక్షులు వెంకటరాముడు, కాశి రంగస్వామి, రహిమాన్, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విఆర్‌ఒలు, విఆర్‌ఎలు పాల్గొన్నారు. అదేవిధంగా విఆర్‌ఒ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎంపికైన నాగేంద్రను రెవిన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

పెత్తందారులు శాసిస్తున్నారు

పోలకల్ జగనన్న సురక్షలో ఎమ్మెల్యే సుధాకర్

ప్రజాశక్తి -సి బెళగల్

జీతాలు ఇప్పించండని అడుగుతున్న పారుశుధ్య కార్మికులు

కోడుమూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేలుగా దళితులు గెలిస్తే పెత్తందారులు ఏళ్లుగా శాసిస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పోలకల్‌లో జగనన్న సురక్ష చేపట్టారు. నియోజక వర్గం అభివృద్ధి కోసం రూ.300 కోట్లు తెచ్చానని, కోడుమూరు, గూడూరు బస్టాండ్, బ్రాహ్మణదొడ్డి రోడ్డు, లద్దగిరి – కొత్తపల్లి రోడ్డు , బ్రిడ్జ్, కర్నూలు–సుంకేసుల రోడ్డు, పోలకల్ వరకు డబుల్ రోడ్డు ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని అన్నారు. ఇది మింగుడు పడక పెత్తందారులు గ్రూపు రాజకీయాలతో శాసిస్తున్నారని అన్నారు. దళిత బిడ్డగా తిరగబడి ప్రజల పక్షాన పథకాలు అందరికీ అందిస్తున్నామని, వచ్చే ఎన్నికల్లో కూడా వైసిపిని గెలిపించాలని ప్రజలను కోరారు. సి బెళగల్ మండలంలో అభివృద్ధి ఎక్కడ చేపట్టారని గ్రామస్తులు ప్రశ్నించారు. జడ్‌పిటిసి, సర్పంచు, ఎంపిటిసిలు డుమ్మా కొట్టడం చర్చనీయాంశమైంది. నెలలు గడుస్తున్నా పారిశుధ్య కార్మికులకు జీతాలు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలా బతకాలని ప్రశ్నించారు. ఎమ్మెల్యే స్పందించి రాష్ట్రమంతా ఈ సమస్య ఉందని ప్రభుత్వంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

ఆదర్శ మహిళా నేత టిసి లక్ష్మమ్మ

ఐద్వా ఆధ్వర్యంలో 8వ వర్ధంతి సభలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ఉమ్మడి జిల్లా మహిళా ఉద్యమనేత టిసి. లక్ష్మమ్మ 8వ వర్ధంతి సభ 37వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శ్యామలమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం అహర్నిశలు పనిచేసిన మహిళా ఉద్యమ నాయకురాలు టిసి.లక్ష్మమ్మ జీవితం మహిళలందరికీ ఆదర్శమని అన్నారు.మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఆమె పోరాటాలు చేశారని అన్నారు. ఐద్వా జిల్లా నాయకులు కెఎస్.పద్మ, అనసూయ, సరస్వతి, షబానా, షేకున్, రేవతి, నాగమణి పాల్గొన్నారు. మహిళా ఉద్యమ నేత టిసి లక్ష్మమ్మ ఆశయాలను కొనసాగిస్తామని మహిళా సంఘం నగర అధ్యక్షులు జి.ధనలక్ష్మి సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె సుధాకరప్ప తెలిపారు. ముజఫర్ నగర్ కుట్టు శిక్షణ కేంద్రంలో టిసి.లక్ష్మమ్మ వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా టిసి లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జి.ధనలక్ష్మి, కె.సుధాకరప్ప మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో మహిళల అభ్యున్నతి కోసం మహిళా ఉద్యమం నిర్మించిన ఘనత లక్ష్మమ్మదే అన్నారు. ముజఫర్ నగర్లో ఆమె జ్ఞాపకార్థం టిసి.లక్ష్మమ్మ, కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి మహిళలకు స్వయం ఉపాధి కల్పించామని తెలిపారు. ప్రజలను ఆప్యాయంగా పలకరించే వారని ఎక్కడ మహిళ ఆపదలో సమస్యలతో ఉన్నా అక్కడికి వెళ్లి వారిని ఓదార్చి సమస్య పరిష్కారానికి కృషి చేసేవారిని తెలిపారు. ఊరూరా గ్రామ గ్రామానికి వెళ్లి మహిళా సంఘాలు ఏర్పాటు చేశారని తెలిపారు. సిపిఎం నాయకులు బి.చిన్న, ఎస్.బషీర్‌అమ్మద్, మహిళలు ఎస్.ఓబులమ్మ, దానమ్మ, ఎస్.శారదమ్మ, ఈశ్వరమ్మ, కె.కుమారి, రమణి, షమీం, రెష్మా , సుజాత మంజుల హాజరయ్యారు. సోమిశెట్టినగర్‌లోరుద్రమ్మ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఐద్వాజిల్లా అధ్యక్షులు కె.అరుణ, సీనియర్ నాయకులు ఇఎల్‌ఎస్ రత్నమ్మలు మాట్లాడారు. ఆమె ఆశయ సాధన కోసం మహిళా సమస్యల పరిస్కారానికి కృషి చేయాలన్నారు. సోమిశెట్టినగర్ ఆటో డ్రైవర్ టి.లక్ష్మన్, సత్యవతిల గుడిసె కాలిపోయి నిరాశ్రయులయినందున వారి కుటుంబానికి ఐద్వానాయకులు, సిపిఎం నాయకులు బి.రాధాకృష్ణ రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఐద్వా నాయకులు బి.సీతమ్మ, మేరీ,పుష్పవతమ్మ, శకుంతలమ్మ, లతా, 19,20 వార్డుల మహిళలు పాల్గొన్నారు

కుట్టు శిక్షణా కేంద్రంలో లక్ష్మమ్మకు నివాళ్లు అర్పిస్తున్న నేతలు

వీకర్ సెక్షన్ కాలనీలో లక్ష్మమ్మకు నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం

ఆర్థిక సాయం అందజేస్తున్న అరుణ, రత్నమ్మ, తదితరులు

సీతారాముల దేవాలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - చిప్పగిరి

కుంకునూరు గ్రామ పెద్దలకు విరాళం అందజేస్తున్న జడ్‌పిటిసి విరుపాక్షి

దేవనకొండ మండలం కుంకునూరు గ్రామంలో సీతారాముల దేవాలయ నిర్మాణానికి పంచాయతీరాజ్ వింగ్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు, జడ్‌పిటిసి విరుపాక్షి విరాళం అందజేశారు. మంగళవారం కుంకునూరు గ్రామ పెద్దలు శంకరయ్య, రంగన్న, నాయుడు, వెంకటప్ప, తిమ్మప్ప, ఆంజనేయులు, వెంకప్పలు విరుపాక్షి నివాసానికి వెళ్లి విరాళం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఆయన స్పందిస్తూ... చరిత్రలో నిలిచే ఇలాంటి నిర్మాణాలకు తన సహాయం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. వెంటనే పెద్దలకు రూ.25 వేలను విరాళంగా అందజేశారు.

ఇస్వీ, గనేకల్ రోడ్డుకు బ్రిడ్జీలు నిర్మించాలి

- ఎంపిడిఒకు సిపిఎం వినతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని ఇస్వీ గ్రామం నుంచి ఇస్వీ చెరువు పక్కన గనేకల్ గ్రామం వరకు వెళ్తున్న రోడ్డుకు మూడు చోట్ల బ్రిడ్జీల నిర్మాణం చేపట్టాలని సిపిఎం నాయకులు కోరారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను తొలగించాలని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ఆ గ్రామ రైతులతో కలిసి ఎంపిడిఒ గీతావాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న మాట్లాడారు. ఆ ప్రాంతంలో సుమారు 300 ఎకరాలకు సంబంధించిన 100 మంది రైతులు పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. ఎరువులు, ఇతర పొలం పనులు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంట చేతికొచ్చినప్పుడు వచ్చిన ధాన్యాన్ని ఇంటికి తీసుకు రావడానికి అవస్థలు పడుతున్నారని, దీనికి వెంటనే పరిష్కారం చూపాలని కోరారు. స్థానిక రైతులు అరికాలప్ప, గొల్లచంద్ర, గుడ్ సాబ్, వెంకటేష్, అయ్యప్ప పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలి

- నేమకల్లు గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి - చిప్పగిరి

'జగనన్న సురక్ష'లో మాట్లాడుతున్న జూటూరు మారయ్య

మురుగు కాలువలు, గుంతలతో ఇబ్బందులు పడుతున్నామని, తమ రాంపురమయ్య వీధిలో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు నేమకల్లు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సర్పంచి ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి బాలన్న ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపిపి భర్త జూటూరు మారయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా మారయ్య మాట్లాడారు. గ్రామంలో రాంపురమయ్య వీధిని తన కళ్లారా చూశానని, నెల రోజుల్లోపు 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించి మంత్రి చేత సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేయించి త్వరగా పూర్తయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. చింతకుంట రిజర్వాయర్‌లో కావాల్సిన తాగునీరు లేకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతోందని చెప్పారు. ఎక్కువ సమస్య ఉంటే ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తామన్నారు. అనంతరం మారయ్య చేతులమీదుగా ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎంపిటిసిలు భీమలింగ, సుంకన్న, సచివాలయ కన్వీనర్ గిరి, ఎంపిడిఒ కొండయ్య, డిటి గుండాల నాయక్, ఇఒఆర్‌డి సంజన, విఆర్‌ఒ ఈరన్న, వైసిపి నాయకులు సత్తిరెడ్డి, గురుదాసు, మోహన్ పాల్గొన్నారు.

ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు లక్ష్యం : ఎంపిపి



ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపిపి అమ్రేష్

ప్రజాశక్తి - కౌతాళం

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని ఎంపిపి అమ్రేష్, కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్, వైసిపి మండల కన్వీనర్ దేశాయ్ ప్రహ్లాద చారి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పొదలకుంట గ్రామంలో 'జగనన్న సురక్ష' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరగకుండా, ప్రభుత్వ అధికారులు ఇంటి వద్దకొచ్చి, ప్రజలకు అవసరమున్న సేవలను అందిస్తున్నారన్నారు. ఇలాంటి పాలన దేశ చరిత్రలోనే లేదన్నారు. జనన, మరణ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో జగనన్న సురక్ష పథకం కింద 11 సేవలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. ఎంపిడిఒ సుబ్బరాజు, ఆర్ఐ రాజశేఖర్, ఎంపిటిసి ముక్కన్న, వైసిపి నాయకులు మల్లయ్య పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ
- ఆయా మండలాల్లో సిపిఎం జీపుజాతాలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, స్త్రీలు, చిన్నపిల్లల ఆస్పత్రులను జిల్లాస్థాయి ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పి.ఎస్.రాధాకృష్ణ, వెంకటేశులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆదోని, జిల్లా అభివృద్ధి కోసం ఈనెల 26 నుంచి 31న ఆదోని నుంచి కర్నూలు వరకు జరిగే మహా పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కార్వాన్ పేట, కౌడల్ పేట, ఖూనీమొహల్లా, అరుణ్ జ్యోతి నగర్ ప్రాంతాల్లో పాదయాత్ర ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆస్పత్రుల్లో అన్ని రకాల జబ్బులకు వైద్యులను నియమించి, మెరుగైన వైద్య పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. సిటి స్కానింగ్ కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆదోని, పత్తికొండ రెండు రెవెన్యూ డివిజన్ పరిధిలో వందలాది గ్రామాల ప్రజలు ఈ ఆస్పత్రులకు వస్తుంటారన్నారు. ప్రభుత్వ స్త్రీల, చిన్నపిల్లల ఆస్పత్రిలో గర్భిణులకు మెరుగైన వైద్యం అందించేందుకు 24 గంటల పాటు మత్తు మందు ఇచ్చే వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, తిప్పన్న, పట్టణ కమిటీ సభ్యులు నాగరాజు, నాగేంద్ర, వెంకటేష్, నాయకులు వీరేష్, అజయ్, రామానాయుడు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** మండలంలో తాగు, సాగునీరు, రోడ్లు, శ్మశాన స్థలాలు, ఇంటి స్థలాల వంటి సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా నాయకులు సి.హనుమంతు, సి.గురుశేఖర్, ఎం.రంగప్ప డిమాండ్ చేశారు. మండలంలోని కలగట్ల గ్రామం నుంచి నాగలాపురం, పార్లపల్లె, పెసలదిన్నె, ఏనుగుబాల, దైవందిన్నె, గార్లదిన్నె, తిమ్మాపురం, టిఎస్.కుల్లూరు, గుడికల్లు, మాసుమాన్‌దొడ్డి, కందనాతి, కడివెళ్ల, హనుమాపురం, కోటేకల్లు, బనవాసి, చెన్నాపురం, దేవబెట్ట గ్రామాల్లో జీపుజాతా నిర్వహించారు. సిపిఎం మండల నాయకులు నరసింహులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మించి మండల ప్రజలకు సాగు, తాగునీరందించాలని డిమాండ్ చేశారు. ఏనుగుబాల చెరువుకు గురురాఘవేంద్ర ప్రాజెక్టు ద్వారా పైపులైన్ పూర్తి చేసి 1000 ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందించాలని కోరారు. గుడికల్లు గ్రామంలో అర్హులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని, మాసుమాన్‌దొడ్డి గ్రామంలో కొండలు, గుట్టల్లో నివాస యోగ్యమైన ఇంటి స్థలాలివ్వాలని డిమాండ్ చేశారు. చెన్నాపురంలో ఎల్‌ఎల్‌సి కాలువ పక్కన ఉన్న శ్మశాన స్థలానికి బదులు రెండెకరాల స్థలాన్ని అనువైన చోట ఇవ్వాలని తెలిపారు. కోటేకల్లులో భూసేకరణ చేసిన 270 ఎకరాల్లో రిజర్వాయర్ నిర్మించి సాగు, తాగునీరు అందించాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించాలని తెలిపారు. దేవిబెట్టలో 30 సెంట్ల శ్మశాన స్థలంలో, అది కూడా బండరాయి 16 సమాధులు తీసి అదే సమాధుల్లో పూడ్చి పెడుతున్నారని చెప్పారు. రెండెకరాల శ్మశాన స్థలాన్ని కేటాయించాలని కోరారు. దైవందిన్నె గ్రామ జనాభాకనుగుణంగా తాగునీటి ట్యాంకు నిర్మించాలని, ఎమ్మిగనూరు, సి.బెళగల్ మీదుగా పోలకల్ వరకు ఆర్‌అండ్‌బి డబుల్ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల నాయకులు నరసింహులు, శేషప్ప, అబ్దుల్లా, విజయ్, రాజు, అశోక్ పాల్గొన్నారు. **దేవనకొండ** మండలంలో పెండింగ్‌లోని హంద్రీనీవా పంట కాల్వల నిర్మాణం చేపట్టి రైతులకు సాగు నీరందించాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, మండల నాయకులు అశోక్, సూరి, పత్తికొండ మండల నాయకులు సురేంద్ర కోరారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఈనెల 26 నుంచి 31 వరకు సిపిఎం ఆధ్వర్యంలో ఆదోని నుంచి కర్నూలు వరకు చేపట్టే మహాపాదయాత్రను జయప్రదం చేయాలని, పంట కాలువల నిర్మాణం చేపట్టాలని జీపుజాతా నిర్వహించారు. మండలంలోని పాలకుర్తి, గుమ్మరాళ్ల, బి సెంటర్, కరివేముల, గద్దెరాళ్ల, పల్లెదొడ్డి, ఓబులాపురం, జిల్లేడు బుడకల, కప్పట్రాళ్ల, నెల్లిబండ, బండగట్టు, ఈదుల దేవరబండ, కోటకొండ, బేతపల్లి, బంటుపల్లి, గుండ్లకొండ, గుడిమరాళ్ల, నల్లచెలిమిల గ్రామాల్లో జాతా సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పందికోన రిజర్వాయర్ నుంచి మండలానికి 46 వేల ఎకరాలకు సాగు స్థిరీకరణను ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. అధికారికంగా నేటికీ ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికే అనేక రూపాల్లో పంట కాలువల నిర్మాణం కోసం సిపిఎం ఉద్యమించిందని, రాబోయే రోజుల్లో ఈ ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. గుండ్లకొండ దగ్గర స్లూయిస్ ఏర్పాటు చేయడం ద్వారా హంద్రీనీవా పైగ్రామాలైన గుండ్లకొండ నుంచి కోటకొండ, మాచాపురం వరకు సాగునీరిచ్చే అవకాశం ఉందని తెలిపారు. మండలంలోని చెరువులన్నటికీ హంద్రీనీవా ద్వారా నీరు మళ్లించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, రాకపోకలకు ఇబ్బందిగా, ప్రమాదాలకు నిలయంగా ఉన్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కోటకొండలో పిహెచ్‌సిని ఏర్పాటు చేయాలని, పొట్లపాడు దగ్గర హంద్రీపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి మండల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపరచాలని కోరారు. పత్తికి పంటల బీమా వర్తింపజేయాలని, పేదలు సాగు చేసుకున్న భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు బజారి, మహబూబ్ బాషా, శ్రీనివాసులు, వీరన్న, వీరేంద్ర, ఓంకార్, అనిల్, సుభాన్ పాల్గొన్నారు. **హోళగుంద** మండలంలోని లింగంపల్లి నుంచి జీపుజాతా ప్రారంభమైంది. ఉదయం ఎల్లార్తి గ్రామంలో సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణస్వామి, ఆలూరు మండల కార్యదర్శి షాకీర్, నాయకులు మైనా, నాగరాజు, వెంకటేశులు మాట్లాడారు. ఆలూరు నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని, అధ్వానంగా ఉన్న రోడ్లను వెంటనే నిర్మించాలని కోరారు. **ఆలూరు** మండలంలోని ముద్దనగేరి గ్రామంలో మూడు నెలలుగా రేషన్ బియ్యం అందలేదని గ్రామస్తులు తెలిపారు. ప్రజా సమస్యలను తెలుసుకొనేందుకు సిపిఎం నాయకులు జీపుజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కెపి.నారాయణ స్వామి, షాకీర్ మాట్లాడారు. ప్రజల ఇంటికే రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు గొప్పలు చెబుతున్నా ఆచరణలో లేదన్నారు. గ్రామంలో మే నెలలో ఎండియు ఆపరేటర్ కార్డుదారుల నుంచి తంబ్ వేయించుకుని బియ్యం వేయలేదని తెలిసిందన్నారు. జూన్, జులై నెల రేషన్ ఇప్పటివరకు ప్రజలకు సరఫరా చేయకుంటే అధికారులు నిద్రపోతున్నారా అని మండిపడ్డారు. గ్రామంలో 20 రోజులకోసారి తాగునీరు అందిస్తున్నారన్నారు. ఎండియు ఆపరేటర్‌ను తొలగించి మూడు నెలల రేషన్ బియ్యం అందించి ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వెంకటేశులు, మైనా, నాగరాజు పాల్గొన్నారు.

ఆదోనిలో సమస్యలు తెలుసుకుంటున్న రాధాకృష్ణ

ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న హనుమంతు

దేవనకొండలో

ఆలూరులో

హోళగుందలో మాట్లాడుతున్న నాయకులు

నీరు లేక కళ తప్పిన ఆర్‌డిఎస్

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని అగసనూరు గ్రామ సమీపంలో ఉన్న రాజోలి బండ డైవర్షన్ స్కీమ్ (ఆర్‌డిఎస్) నీరు లేక వెలవెలబోతోంది. రాళ్లు తేలి ఇసుక మేటలతో దర్శనమిస్తోంది. గతేడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే నాటికి జులై మాసంలో తుంగభద్ర జలాలతో ఆర్‌డిఎస్ నిండుకుండలా కళకళలాడేది. ఆనకట్టపై రెండు అడుగుల మేరా లక్షలాది క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్లేవి. ఈఏడాది సరైన వర్షాలు లేక ఆర్‌డిఎస్ వెలవెలబోతోంది. మండలంలోని నదీతీర గ్రామాలైన అగసనూరు, కందుకూరు, సాతనూరు, కామన్‌దొడ్డి, కడదొడ్డి, తుమ్మిగనూరు గ్రామాల్లో ఈపాటికే గతేడాది వరి పంటలు వేసి పొలాలు పచ్చగా కనిపించేవి. వర్షాలు లేక నదిలో నీరు లేకపోవడంతో ఇప్పటివరకు నదీతీర గ్రామాల్లో పంటలు వేయడానికి రైతులు ఆసక్తి చూపడం లేదు. కర్ణాటకలో ఉన్న హోస్పేట్ డ్యాం నుంచి దిగువకు నీరు విడుదల కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నీరు లేక వెలవెలబోతున్న ఆర్‌డిఎస్

పట్టాలున్న వారందరికీ..

స్థలం వచ్చే వరకు పోరాటం

- టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కా రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని ఎరిగేరి గ్రామంలో పట్టాలున్న ప్రజలందరికీ స్థలాలు వచ్చే వరకు పోరాటం చేస్తామని టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి తెలిపారు. మంగళవారం ఎరిగేరి గ్రామంలో పట్టాలు ఇచ్చిన స్థలాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడారు. గత ప్రభుత్వం 2006లో సర్వే నెంబరు 253లో 9 ఎకరాల 69 సెంట్ల ప్రభుత్వ భూమిని దాదాపు 300 మంది స్థలాలు లేని పేదలకు పట్టాలిచ్చిందని తెలిపారు. ఎరిగేరి గ్రామంలో ఆదోనికి వెళ్లే మెయిన్ రోడ్డులో ఉన్న అత్యంత విలువ గల ఈ భూమిని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వారి కుటుంబ సభ్యులు, వైసిపి ముఖ్యనాయకులు కబ్జా చేశారని తెలిపారు. ప్రయివేట్ లేఅవుట్లు వేసి ఇళ్ల స్థలాలకు విక్రయిస్తూ రియల్ దందాకు తెరలేపారని విమర్శించారు. మూడుసార్లు ఓట్లు వేసి గెలిపించిన ఎరిగేరి గ్రామస్తులకు బాలనాగిరెడ్డి ఇస్తున్న బహుమతి ఇదేనని మండిపడ్డారు. 'మీరు ప్రభుత్వ, ప్రజల స్థలాలు, ఆస్తులను అమ్ముకోండి. మేము కళ్లకు గంతలు కట్టుకుని చూస్తూ ఉంటామ'నే రీతిలో ప్రభుత్వ అధికారులు తీరు ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులందరూ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి అండగా ఉంటున్నారని విమర్శించారు. ఎరిగేరి గ్రామంలో 2006లో పట్టాలు వచ్చిన ప్రజలందరికీ అండగా ఉంటామని, ఈ స్థలాలు ప్రజలకు ఇచ్చే వరకు టిడిపి పోరాటం చేస్తుందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తుందని, వచ్చిన వెంటనే స్థలాలు లేని పేదలందరికీ స్థలాలిచ్చి ఇల్లు కట్టించి ఇస్తామని చెప్పారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి వెంకటపతి రాజు, మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు టిప్పు సుల్తాన్, టిడిపి నాయకులు కురుగోడు రహిమాన్, రాజానంద్, రాజాబాబు, దమ్ములుదిన్నె రమేష్ గౌడ్, బాపురం వెంకటరెడ్డి, ఎరిగేరి రామలింగ, బసవరాజు, శ్రీరాములు, అంజి, నాగరాజు, సీతయ్య, శీను, డేవిడ్, ఈరన్న, స్వామి దాసు, రమేష్ పాల్గొన్నారు.

కబ్జాకు గురైన స్థలాన్ని చూపుతున్న తిక్కా రెడ్డి

ఆత్మహత్యాయత్నానికి కారకులను

విధుల నుంచి తొలగించాలి

- సిపిఎం

ప్రజాశక్తి-ఆలూరు

హాలహర్వి మండలం విరూపాపురం గ్రామంలో రఫీక్ యువకుని ఆత్మహత్యాయత్నానికి కారణమైన వారిని విధుల నుంచి తొలగించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం తాలూకా నాయకులు కెపి.నారాయణ స్వామి, ఆలూరు, హాలహర్వి మండల కార్యదర్శులు షాకీర్, కృష్ణ మాట్లాడారు. రఫీక్ ప్రేమ జంటకు సహకరించాడనే కారణంతో పోలీసులు హింసించి దాడి చేయడం, వేధింపులకు గురి చేశారని తెలిపారు. రఫీక్ తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని చెప్పారు. దీనికి కారణమైన ఎఎస్ఐ, కానిస్టేబుల్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి నోటీసూ ఇవ్వకుండా కేవలం అనుమానంతో రఫీక్‌ను నేరం ఒప్పుకోవాలని కొట్టడం ఏ చట్టం చెబుతోందని ప్రశ్నించారు. అమాయకులను భయభ్రాంతులకు గురిచేస్తూ ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్న ఇలాంటి వారిపై కేసు నమోదు చేసి, విధుల నుంచి తొలగించాలని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. సిపిఎం నాయకులు వెంకటేశులు, మైనా, నాగరాజు, గోవర్ధన్, దేవరాజు పాల్గొన్నారు.

బదిలీ ఎస్ఐకి సన్మానం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

పెద్దకడబూరు ఎస్ఐగా పని చేసి బదిలీపై వెళ్తున్న శ్రీనివాసులును సిపిఎం మండల కార్యదర్శి ఈడిగ తిక్కన్న గౌడ్, కార్యదర్శి వర్గసభ్యులు కె.పరమేష్ మంగళవారం శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో ఎస్ఐ శ్రీనివాసులు సేవలు మరువలేమని తెలిపారు. రాష్ట్రంలో ఉత్తమ పోలీసు స్టేషన్ అవార్డు తీసుకొచ్చి ఎస్పీ ఫక్కీరప్ప చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్న ఘనత ఘనత శ్రీనివాసులుకు దక్కిందని కొనియాడారు.

ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూర్చడమే లక్ష్యం : ఎంపిడిఒ

ప్రజాశక్తి-పెద్దకడబూరు

ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిడిఒ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండలంలోని కంబాలదిన్నె గ్రామంలో 'జగనన్న సురక్ష' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. గ్రామంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బంది, వాలంటీర్లపై ఉందన్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామంలో తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి సమస్యలను గుర్తించి సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. సర్పంచి తిమ్మక్క, ఆర్ఐ మహేష్, విఆర్ఒ సంజీవయ్య, పంచాయతీ కార్యదర్శి మహేంద్ర పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని హెచ్.మురవణి ఉన్నత పాఠశాలలో పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు గద్వాల సోమన్న, లక్ష్మీనారాయణ, ఆంజనేయులును ప్రధానోపాధ్యాయులు మంజుల ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడారు. ఉపాధ్యాయులకు బదిలీ సహజమని తెలిపారు. విద్యార్థులు వీడ్కోలు పలుకుతూ కన్నీటిపర్యంతమయ్యారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు, నాగజ్యోతి, జయరాజు, బాలకృష్ణ, రమేష్, గణేష్, పౌరోహితం శ్రీనివాసులు, లక్ష్మినాయక్, బసవరాజు, తాయప్ప, రాజశేఖర్, రాజశేఖర్ రెడ్డి, ఫయాజ్ పాల్గొన్నారు.

అభివృద్ధిపై ఇప్పుడే నిద్ర లేచిన ప్రతిపక్షాలు

- ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ఆదోని అభివృద్ధి, సంక్షేమంపై ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు ఇప్పుడే నిద్రలేచాయని, గతంలో ఎందుకు నోరు విప్పలేదని ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం పట్టణంలోని వీరశైవ కల్యాణ మండపంలో 'జగనన్న సురక్ష' నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతిపక్షాలు ఇప్పుడే నిద్ర లేచి 'ఆదోని పట్టణం ఇట్లా ఉంది. అట్లా ఉంద'ని చెబుతున్నాయని, ఎంతో చరిత్ర ఉన్న ఆదోనిని తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నానని తెలిపారు. గతంలో అసంపూర్తిగా ఉన్న బైపాస్ రోడ్డును పూర్తి చేస్తున్నామని, ఇతర అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు. 14 ఏళ్ల టిడిపి పరిపాలనలో అభివృద్ధిపై ఎవరూ మాట్లాడలేదని, వారు అప్పుడేం చేశారని ప్రశ్నించారు. తాము కూడా 15 ఏళ్లు అధికారం ఉంటే ఏదైనా చేసేందుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. బైపాస్ రోడ్డు నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలుస్తారని, ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి డిగ్రీ కళాశాలను ఆదోనిలో ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్రంలో ఎలాగైనా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని పదవి నుంచి దింపాలని ఒకపక్క మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మరోపక్క సినీ నటుడు పవన్ కల్యాణ్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. వారెన్ని చేసినా జగన్‌ను గద్దెదించలేరని తెలిపారు. 2024లో కూడా జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ... జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు దమ్ముంటే రాష్ట్రంలోని 175 స్థానాల్లో పోటీ చేయాలని తెలిపారు. గతంలో పోటీ చేసిన రెండు స్థానాల్లో కూడా ఓడిపోయారని చెప్పారు. మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, కమిషనర్ రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

2024లో జగనే మళ్లీ సిఎం

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

వచ్చే 2024 ఎన్నికల్లోనూ గెలిచి జగన్మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం కోసిగి మండలం కందుకూరు గ్రామ సచివాలయ పరిధిలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఆయన సతీమణి, కాచాపురం సర్పంచి జయమ్మ హాజరయ్యారు. ప్రతి గడపకూ వెళ్లి వాలంటీరు వ్యవస్థ ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలు, అమలును అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ సతీష్ కుమార్, ఎంపిపి ఈరన్న, జడ్‌పిటిసి పవిత్ర పాటిల్, నాడిగేని నరసింహులు, బెట్టనగౌడ్, మహంతేష్ స్వామి, మంగమ్మ, భీమక్క, నాడిగేని నాగరాజు, నరసింహులు గౌడ్, ఎఇ వీరేష్, ఎపిఎం సత్యమ్మ, ఎపిఒ జయరాం, కడదొడ్డి సర్పంచి హుస్సేని, కాల్వ లక్ష్మయ్య, తిక్కయ్య, ఎంపిటిసి మల్లయ్య, అగసనూరు, తుమ్మిగనూరు సర్పంచులు ఉలిగయ్య, ఈరన్న, రమేష్, పరశురాం పాల్గొన్నారు.

కందుకూరులో పాల్గొన్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, జయమ్మ

అవగాహన కల్పిస్తున్న పరిశీలకులు

ఓటర్ల నమోదులో అప్రమత్తత అవసరం

- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

గ్రామాలు, పట్టణ పరిధిలోని వార్డుల్లో పోలింగ్ బూత్ స్థాయిలో ఓటర్ల నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి సూచించారు. మంగళవారం టిడిపి రాష్ట్ర కమిటీ ఆదేశాలు మేరకు స్థానిక మెడికల్ భవన్‌లో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాన్ని జూమ్ విజువల్ ద్వారా ప్రారంభించారు. ఇంటిగ్రేటెడ్ శిక్షణ తరగతులకు రామాంజనేయులు, వినయ్ హాజరయ్యారు. ఆర్‌టిఎస్‌పై అవగాహన కల్పించారు. అలాగే బిఎల్ఎ (బూత్ లెవెల్ ఏజెంట్)లకు అవగాహన కల్పించారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు మరణించిన వారిని, కొత్తగా పెళ్లయిన వారిని ఓటర్ల జాబితా నుంచి ఎలా తొలగించాలనే దానిపై వివరించారు. క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి ఓటు నమోదు చేసుకునే విధంగా కృషి చేయాలని సూచించారు. టిడిపి నాయకులు రామదాసు గౌడ్, దయాసాగర్, శాబీర్, రామకృష్ణ నాయుడు, రంగస్వామి గౌడ్, కలీముల్లా, మల్లికార్జున, మధుబాబు, బందేనవాజ్, రంగన్న, దేవేంద్ర, కటారి రాజేంద్ర, దామ నరసింహులు, సలీం, సలాం, కామర్థి మహేష్, మాబు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా 'రాంజల'

- అన్ని హంగులతో ప్రణాళికలు సిద్ధం చేయండి
- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

పట్టణ శివారులోని పురాతన చెరువు రాంజలను పర్యాటక ప్రాంతంగా గుర్తించామని ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (ఆడా) ప్రత్యేకాధికారి, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. మంగళవారం టూరిజం శాఖ అధికారి విజయ, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, తహశీల్దార్ వెంకటలక్ష్మితో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రాంజల చెరువు ప్రాంతాన్ని అన్ని సదుపాయాలతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. పర్యాటకులకు ఆహ్లాదకరమైన పార్కులు తయారు చేసి మౌలిక సదుపాయాలైన రోడ్లు, తాగునీరు, టాయిలెట్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఇంజినీర్ నాగభూషణం రెడ్డి ఉన్నారు.

పర్యాటక కేంద్రంగా 'గాజులదిన్నె'

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని గాజులదిన్నె ప్రాజెక్టును ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కింద ఆహ్లాదకరంగా రూపొందించి పర్యాటక కేంద్రంగా రూపొందిస్తామని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. మంగళవారం ప్రాజెక్టు వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. సివిల్ పనులు జరుగుతున్న తీరును అధికారులు ఆయనకు వివరించారు. సివిల్ పనులు పూర్తయ్యేలోపు భూసేకరణ పనులను కూడా పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. త్వరలోనే ప్రాజెక్టు నీటిపారుదల ఇంజినీర్లు, రెవెన్యూ సిబ్బంది ఉమ్మడిగా పరిశీలించి మునక భూములను గుర్తించి విస్తీర్ణాన్ని నిర్ధారిస్తారని తెలిపారు. తహశీల్దార్ వేణుగోపాల్, ప్రాజెక్టు ఈఈ శైలేంద్రనాథ్, ఎడిఎ ఖాద్రీ, ఎఒ హేమలత పాల్గొన్నారు.

గాజులదిన్నె ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

- సొసైటీ ఛైర్మన్ గోవర్ధన

ప్రజాశక్తి - ఆస్పరి

ప్రజల సమస్యలు పరిష్కరించడానికే 'జగనన్న సురక్ష' నిర్వహిస్తున్నట్లు సొసైటీ ఛైర్మన్ గోవర్ధన, వైసిపి మండల కన్వీనర్ పెద్దయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని హాలిగేర, కైరుప్పల సర్పంచులు లింగమ్మ, తిమ్మక్క, ఎంపిడిఒ రాణెమ్మ, తహశీల్దార్ కుమారస్వామి ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 'జగనన్న సురక్ష' ద్వారా ఇప్పటి వరకు కైరుప్పల గ్రామంలో ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 97, కుల ధ్రువీకరణ పత్రాలు 101 అందజేసినట్లు తెలిపారు. జెసిఎస్ మండల కన్వీనర్ బసవరాజు, సొసైటీ సిఇఒ అశోక్, బిటెక్ వీరభద్ర, రంగన్న, తిమ్మప్ప, ప్రకాష్, నాయుడు, రాజన్న గౌడ్, విజయ్ కుమార్, ఉప సర్పంచి స్వాతి, ఇఒఆర్‌డి నరసింహా రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ గాయత్రి పాల్గొన్నారు.

ధ్రువపత్రాలను అందజేస్తున్న నాయకులు

అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు అన్యాయం

అగ్రికల్చర్ అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులకు అన్యాయం జరిగిందని సిపిఎం గ్రామ నాయకులు నరసింహులు మండిపడ్డారు. కైరుప్పల సచివాలయం దగ్గర నిర్వహించిన 'జగనన్న సురక్ష'లో తహశీల్దార్ కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంట ఇన్సూరెన్స్‌లో పక్క మండలాల రైతులకు ఎకరాకు రూ.5,136 క్లెయిమ్ అయితే ఆస్పరి మండల రైతులకు కేవలం రూ.1,350 క్లెయిమ్ కావడం ఏమిటని ప్రశ్నించారు. నీటి వనరులున్న మండలాలకు ఇన్స్యూరెన్స్ ఎక్కువ రావడం, వర్షాధారంతోనే పంటలు వేసే ఆస్పరి రైతులకు తక్కువ ఇన్స్యూరెన్స్ పడడం ఏమిటని అధికారులను నిలదీశారు. అధికారులు స్పందించి సరైన నివేదిక తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. లేకపోతే రైతులను సమీకరించి రోడ్డుపై బైఠాయిస్తామని హెచ్చరించారు.

ప్రకటన

దాసరి వెంకటేశ్వర్లు తండ్రి లేట్ సుబ్బయ్య ఓర్వకల్లు మండలం, కర్నూలు జిల్లా. రిజిస్టరు డాక్యుమెంట్ నెంబర్ 1883/2007 ద్వారా నాకు చెందియున్నది. నా క్లైంట్ చోలమండలం హౌసింగ్ కంపెనీ నందు గృహరుణము కొరకు అప్లై చేసియున్నాడు. కానీ నా క్లైంట్ పేరు డాక్యుమెంట్‌లో దాసరి వెంకటేశ్వర్లుగా వుండి ఆధార్ కార్డు నందు దాసరి పోలేమైనా వేంకటేష్‌గా వుంది. ఈ రెండు పేర్లు ఒకటే అని నా క్లైంట్ తెలియపరుస్తున్నాడు. అయితే దీనిపై డాక్యుమెంట్ ప్రకారం నెం. : 1883/2007 తేది 7-12-2007 పై కానీ ఏటువంటి అభ్యంతరములు ఉన్నా వాటిని 7 రోజులలో తెలుపగలరు అని మనవి ఇందులో ఎటువంటి ఆక్షేపణలు ఉన్నా తెలుపగలరు.

ఇట్లు
ఎ. రాజేష్ కుమార్,
అడ్వకేట్, ఆదోని
సెల్ : 7989742323

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు

కదం తొక్కిన ఆశాలు

- సమస్యలు పరిష్కరించాలని డిఎంహెచ్ఒ కార్యాలయం వరకు ర్యాలీ, ధర్నా
- ప్రభుత్వం స్పందిచకపోతే పతనమే.. - సిఐటియు, ఎపి ఆశా వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఆశా వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని డిఎంహెచ్ఒ కార్యాలయంకు కదం తొక్కారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆదోళన ఉదతం చేస్తామని, ప్రభుత్వ పతనం తప్పదని ఆశాలు హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్స్ యూనిన్ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు సిఐటియు కార్యాలయం నుండి డిఎంహెచ్ఒ కార్యాలయం వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.ఏసురత్నం, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, రమణకుమారి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.మహమ్మద్ గౌస్, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్‌లు మాట్లాడారు. ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వానికి పతనం ఖాయమని హెచ్చరించారు. ఆశా వర్కర్స్‌తో సంబంధం లేని పనులు చేయిస్తూ పని భారం పెంచుతున్నారని చెప్పారు. నాణ్యమైన సెల్‌ఫోన్, 4జి సిమ్స్ ఇవ్వాలని, ఆన్లైన్ వర్క్ శిక్షణ ఇవ్వాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఆన్లైన్ వర్కుల పేరుతో జరుగుతున్న వేధింపులు, బెదిరింపులు వెంటనే ఆపాలన్నారు. ప్రభుత్వ సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఆశా వర్కర్స్‌ని రోజూ విలేజ్ క్లినిక్, సచివాలయాలలో ఉదయం 9 నుండి సాయంత్రం 5గంటల వరకు ఉండాలని, క్లినిక్‌లు క్లీన్ చేయటం, ఓపీ వర్క్, అటెండర్ పనులు చేయించడంతో పాటు రెండు సార్లు రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని అధికారులు వేధిస్తున్నారని తెలిపారు. సెలవులు లేకపోవడంతో అనారోగ్యాల పాలౌతున్నారు. సంబంధం లేని పనులు చేయించటం, వాక్సిన్ బాక్స్‌లు తీసుకురావడం, ఆన్లైన్ వర్క్‌లు చేయించటం ఆపాలన్నారు. ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్స్ వెంటనే అమలు చేయాలన్నారు. అనంతరం ఆశాల సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ డిఎంహెచ్ఒకి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నంద్యాల పట్టణ అధ్యక్ష కార్యదర్శులు శివమ్మ, షమీమ్, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, పిహెచ్‌సిల లీడర్లు, కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

యథేచ్ఛగా నకిలీలు

- మార్కెట్‌లోకి కల్తీ పత్తి విత్తనాలు - రెండేళ్లుగా నిండా మునిగిన రైతులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లాలో మార్కెట్‌లోకి యథేచ్ఛగా కల్తీ పత్తి విత్తనాలు వచ్చి చేరుతున్నాయి. జిల్లాలో కల్తీ విత్తనాల వల్ల రైతులు గత రెండేళ్లుగా నిండా మునిగారు. అయినా అధికారులు తనిఖీలు చేపట్టడం లేదు. దీంతో పత్తి రైతుల భవిష్యత్తు ఈ ఏడాది కూడా ప్రశ్నార్థంగా మారింది...

గత రెండేళ్లుగా నకిలీ పత్తి విత్తనాలు రైతులకు నష్టాలను మిగిల్చాయి. కర్నూలు జిల్లాలో పత్తి సాధారణ సాగు 6.11 లక్షల ఎకరాలు కాగా సాధారణ సాగుకు మించి 6.46 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. దీన్ని ఆసరాగా తీసుకున్న కొన్ని పత్తి విత్తనాల కంపెనీలు కల్తీ విత్తనాలను యథేచ్ఛగా అమ్మి సొమ్ము చేసుకున్నాయి. దిగుబడులు లేకపోవడంతో రైతులు నష్టాలను చవిచూశారు. కర్నూలు డివిజన్‌లో 1.02 లక్షల ఎకరాల్లో, ఆదోని డివిజన్‌లో 1.40 లక్షలు, ఎమ్మిగనూరు డివిజన్‌లో 1.29 లక్షలు, ఆలూరు డివిజన్‌లో 1.35 లక్షలు, పత్తికొండ డివిజన్‌లో 1.35 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. నకిలీ విత్తనాల దాటికి 5 లక్షల ఎకరాలకు పైగా పంట నష్టపోయింది. సూపర్ కాటన్, జంగి, ఆదిత్య, అఖిర, తడాకా, సూపర్, వింధ్య, లయన్, స్టాలిన్, 3228, కిలాడీ, 429 సూర్య, బిగ్‌బాస్, రాధిక, బిజి 2 వంటి 30 రకాల కంపెనీల విత్తనాలను కొని పంట దిగుబడి రాకపోవడంతో రైతులు నష్టపోయారు. కోట్లల్లో రైతుల పెట్టుబడి మట్టిపాలైంది. మరో వైపు కల్తీ పత్తి విత్తనాల రాక ఆరంభమైంది. కల్తీ విత్తనాలు యథేచ్ఛగా మార్కెట్‌లోకి వచ్చి చేరుతున్నారు. నకిలీ, కల్తీ విత్తనాలపై దృష్టి సారించాల్సిన వ్యవసాయశాఖ, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టడం లేదు. జిల్లా పునర్విభజనలో నేపథ్యంలో తనిఖీలు చేసేందుకు సిబ్బంది కొరత ఉందని సాకుగా చెబుతున్నారు. ఏప్రిల్ నుంచే వ్యవసాయాధికారులు బృందాలుగా ఏర్పడి విత్తన శుద్ధి కేంద్రాల్లో తనిఖీలు చేయాల్సి ఉండగా ఆ ఊసే లేకుండా పోయింది. బిటి విత్తనాలకు సంబంధించి కో మార్కెటింగ్ లేకపోవడంతో సెంట్రల్ సీడ్ లైసెన్సు కలిగిన కంపెనీలకు చెందిన రకాలతో వివిధ కంపెనీలు ఆయా బ్రాండ్లతో బిటి పత్తి విత్తనాలను సిద్ధం చేస్తున్నాయి. కొన్ని కంపెనీల పేర్లతో కల్తీ విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చి చేరుతున్నాయి.

వ్యవహారం సాగుతుందిలా...

పత్తి పంట చేతికందాకా విత్తనాలను రైతుల దగ్గర నుంచి కొందరు దళారులు సేకరించు కుంటారు. జిల్లాలో జిన్నింగ్ మిల్లులు ఎక్కువగా ఉన్న నంద్యాల ప్రాంతం నుంచే ఈ వ్యవహారం మొదలవుతుంది. ఎలాంటి అనుమతులూ లేకున్నా పట్టణాల్లో వివిధ పేర్లతో ఉన్న ప్యాకెట్లలో, గ్రామాల్లో లూజు విత్తనాల పేరుతో ఈ విక్రయాలు సాగుతాయి. తక్కువ ధరతో నాణ్యమైన దిగుబడి వస్తుందంటూ రైతులకు ఆశ చూపుతారు. అయితే కొన్న విత్తనాలకు రసీదులు మాత్రం ఇవ్వరు. అలా నమ్మి సాగు చేసిన రైతులు పొలాల్లో దిగుబడి సరిగ్గా రాకపోవడంతో నిర్ఘాంతపోతారు. తీరా తాము మోసపోయామని

తెలుసుకున్న రైతులు విక్రయదారులను ప్రశ్నిస్తే భూమి సరిగ్గా లేదనో, నీరు సరిగ్గా అందలేదనో సాగులు చెప్పి ప్లేటు మార్చేస్తారు. జిల్లాలో కొన్నేళ్లుగా ఇదే తంతు సాగుతున్నా అధికారులు మాత్రం ప్రత్యేక దృష్టి సారించడం లేదు.

కావాలంటే అప్పులూ ఇస్తారు..

నకిలీ విత్తనాల వ్యవహారంలో రైతులకు అప్పు ఆశ కూడా చూపిస్తారు. తమ దగ్గర విత్తనాలు కొంటే అప్పుగా ఇస్తారు. అప్పుకు సంబంధించి ప్రాంసరీ నోటును ఖచ్చితంగా రాయించు కుంటారు. పంట చేతికి రాక నష్టాల్లో కూరుకు పోయినా రైతు నుంచి ముక్కు పిండి మరీ డబ్బును వసూలు చేస్తారు. ఇలా నకిలీ వ్యవహారంలో రైతులు అప్పులపాలు కూడా అవుతున్నారు.

రైల్వే గేట్ కమ్మీలు తొలగించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్
- ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష
- టిడిపి, కాంగ్రెస్, ప్రజా సంఘాల నాయకులు మద్దతు

ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష, మద్దతుగా పాల్గొన్న సిపిఎం, టిడిపి, కాంగ్రెస్, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని నూనెపల్లె ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద రైల్వే గేట్ కమ్మీలు తొలగించి పాదచారులకు ఇబ్బంది లేకుండా చూడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. నూనెపల్లె రైల్వే గేట్ కమ్మీలు తొలగించాలని కోరుతూ ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలో ఎస్.మస్తాన్వలి, బాబుల, బబ్లు కూర్చున్నారు. ఈ దీక్షలను సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ ప్రారంభించారు. దీక్షలకు టిడిపి నాయకులు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవి. సుబ్బారెడ్డి, అబ్దుల్ సమ్మదు, అబులైసు, ప్రజాస్వామ్య లౌకిక ఐక్యవేదిక నాయకులు, ఎస్పైడి.ప్రసాద్, చింతలయ్య, మస్తాన్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు మహబూబ్బాషా, జాన్‌జాగో నాయకులు సలాం మౌలానా, ఐఎంఎల్ నాయకులు రామరాజు, జెవివి నాయకులు వాసు తదితరులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆవాజ్ కమిటీ చేసే పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తామన్నారు. వెంటనే రైల్వే గేట్ కమ్మీలు తొలగించాలన్నారు. ఎంపీ ప్రజల సౌకర్యం కోసం కాకుండా తన శ్రేయస్సు కోసం, తన వ్యాపార అభివద్ధి కోసం ఆలోచన చేస్తున్నారని తెలిపారు. గేట్ కమ్మీలు తొలగించడానికి చేతగాని ఎంపీ ఎందుకు ఉండాలని ప్రశ్నించారు. అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం కావాలంటే ఇంకా ఆరు నెలలు పడుతుందని, అంతవరకు ఈ ప్రాంత ప్రజలందరూ అనేక విధాలుగా ఆర్థికంగా నష్టపోతారని తెలిపారు. నంద్యాల వారే కాకుండా ఇతర ప్రాంతాల నుండి కూడా పాదచారులు రైల్వే గేట్ మార్గాన నంద్యాలకు, వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారని తెలిపారు. ప్రజలకే కాకుండా ఆటో వాళ్ళు, వ్యాపార సంస్థలు, హెూటల్లు, ఫ్యాక్టరీలకు వెళ్లే కార్మికులు, కలెక్టర్ ఆఫీస్‌కు, ఇతర ఆఫీసులకు వెళ్లే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులందరూ నష్టపోతారని చెప్పారు. ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి మస్తాన్వలి మాట్లాడుతూ ఎంపీ ఇప్పటికైనా రైల్వే జిఎంతో మాట్లాడి కమ్మీలు తొలగించాలని డిమాండ్ చేశారు. పట్టణ అధ్యక్షుడు బాబుల మాట్లాడుతూ రైల్వే గేట్ కమ్మీలు తొలగించకుంటే అన్ని ప్రజా సంఘాలు కలుపుకొని పోరాడుతామని, అప్పటికి దిగి రాకపోతే కమ్మీలు తామే తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు.

చిరు వ్యాపారులకు వరం 'జగనన్న తోడు'

- 17,691 మంది లబ్ధిదారులకు రూ. 45.90 లక్షలు జమ
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న జిల్లా కలెక్టర్, జెడ్పి చైర్మన్ తదితరులు

చిరు వ్యాపారులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న తోడు పథకం వరంలాంటిదని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ తెలిపారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న తోడు పథకం కింద చిరు వ్యాపారులకు 7 విడతలో 5,10,412 మందికి వడ్డీ లేని రూ.549.70 కోట్ల రుణాలు, గతంలో ఈ పథకం ద్వారా రుణాలు పొంది సకాలంలో చెల్లించిన వారికి రూ. 11.03 కోట్ల వడ్డీ మొత్తాన్ని కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాలకు జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని లైవ్ ద్వారా నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, మైనారిటీ సంక్షేమ అభివృద్ధి ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, హస్తకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, డిఆర్డిఏ పీడీ శ్రీధర్ రెడ్డి, మెప్మా పీడీ శోభ, ఎల్డిఎం రవీంద్ర తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న తోడు పథకం కింద చిరు వ్యాపారులు రుణాలు పొంది సకాలంలో చెల్లించిన 17,691 మంది లబ్ధిదారులకు వడ్డీ రీయంబర్స్మెంట్ కింద రూ.45.90 లక్షలు జమ చేసినట్లు తెలిపారు. అలాగే ఈ ఏడాది డిసెంబర్ వరకు గుర్తించిన 18,274 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ. 19.68 కోట్ల మొత్తాన్ని జమ చేయనున్నామన్నారు. ఇంకా ఏవరైనా అర్హత ఉండి కూడా పథకం అందకపోతే వారికి కూడా లబ్ది చేకూరుస్తామన్నారు. జగనన్న తోడు పథకం చిరు వ్యాపారులకు పెట్టుబడితో పాటు జీవనోపాధికి ఉపయోగపడు తోందన్నారు. జిల్లాలో జగనన్న తోడు వడ్డీ రీయంబర్స్మెంట్ కింద ఆళ్లగడ్డ నియోజక వర్గంలో 2793 మందికి రూ.7.24 లక్షలు, బనగానపల్లిలో 2398 మందికి రూ.6.22 లక్షలు, డోన్‌లో 2803 మందికి రూ.7.27 లక్షలు, నందికొట్కూర్ లో 2654 మందికి రూ.6.88 లక్షలు, నంద్యాలలో 3980 మందికి రూ.10.32 లక్షలు, పాణ్యంలో 765 మందికి రూ.1.98 లక్షలు, శ్రీశైలంలో 2298 మందికి రూ.5.96 లక్షలు నేరుగా జమ చేశామన్నారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తోన్న జగనన్న తోడు ఆర్థిక సహాయాన్ని చిరు వ్యాపారులు సద్విని యోగం చేసుకోవాలన్నారు. అనంతరం చెక్కును అందజేశారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సంజామల

రాజకీయాలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. మంగళవారం సంజామలలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎస్సీ కాలనీ, కోట వీధులలో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి వారు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉండి సంక్షేమ పథకాల లబ్ధి పొందని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కెడిసిసి బ్యాంకు డైరెక్టర్ గుణ్ణం సూర్యప్రకాశ్ రెడ్డి, వైసిపి నాయకులు, అధికారులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాన సత్రానికి విరాళం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని రామతీర్థం పుట్టాలమ్మ క్షేత్రంలోని అన్నదాన సత్రానికి ఆళ్లగడ్డకి చెందిన ప్రముఖ న్యాయవాది ఆర్.శ్రీనాథ్ రెడ్డి అల్లుడు రామ కార్తికేయ రెడ్డి రూ. 50 వేలు విరాళంగా ఈవో సాయి జయ చంద్రారెడ్డికి అందజేశారు. యుఎస్ఏ (ఫ్లోరిడా)లో ఉన్న రామ కార్తికేయ రెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం పుట్టాలమ్మ క్షేత్రానికి వచ్చి పుట్టాలమ్మ పరశు రామేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆనంతరం ఆయన ఆలయ చైర్మన్ గంగుల మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో క్షేత్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రముఖ న్యాయవాది శ్రీనాథ్ రెడ్డి(మామ) తో కలిసి ఈవోకు రూ.50 వేలు అన్నదానం నిమిత్తం అందజేశారు. అనంతరం రామ కార్తికేయ రెడ్డిని ఇఒ శాలువా, పూలమాలతో సత్కరించారు.

లక్ష్మమ్మ ఆశయ సాధనకు కృషి : ఐద్వా

ప్రజాశక్తి - నంద్యాల

మహిళా సంఘంగా జిల్లా ఉద్యమ నిర్మాణానికి టిసి లక్ష్మమ్మ తన సాయశక్తులా కృషి చేశారని, ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు టి.నిర్మల తెలిపారు. మంగళవారం స్థానిక ఎన్‌జిఒ కాలనీలోని టి.నరసింహయ్య భవన్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు టిసి లక్ష్మమ్మ 8వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు టి. నిర్మల, మహిళా సంఘం పట్టణ మాజీ అధ్యక్షురాలు, సిపిఎం మాజీ కౌన్సిలర్ సత్యనారాయణమ్మ టిసి లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా టి.నిర్మల మాట్లాడుతూ టిసి లక్ష్మమ్మ ప్రజా సమస్యలపై పని చేస్తూనే, స్థానిక సంస్థల ఎన్నికల్లో కల్లూరు వార్డ్ మెంబర్‌గా ఎన్నికై పని చేశారని తెలిపారు. సారా నిషేధం ఉద్యమంలో ఆమె పాత్ర అమోఘమని, మద్యపాన నిషేధం కోసం మహిళలను ఏకం చేసి ఉదత పోరాటాలు సాగించిన మహోన్నత వ్యక్తి అని ఆమె సేవలను కొనియాడారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కోసం, మహిళల హక్కుల కోసం, మహిళలపైన జరుగుతున్న వేధింపులు నిర్మూలించాలని, గృహ హింస ఆపాలని, గృహ హింస నిరోధక చట్టం సాధించడంలో అనేక పోరాటాలు నడిపిన వ్యక్తి టిసి లక్ష్మమ్మని అన్నారు. కరెంటు

టిసి లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పిస్తున్న నాయకురాళ్లు

చార్జీలు తగ్గించాలని, సమాజంలో జరుగుతున్న దోపిడీపై, మహిళలకు సమాన అవకాశాల కోసం పోరాడారని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు కృష్ణవేణి, వెంకటలక్ష్మి, బాను, నాగమణి, మహాలక్ష్మి, హైమావతి,

గంజాయి రవాణాపై ఉక్కుపాదం : ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

గంజాయి అక్రమ రవాణా కార్యకలాపాలు నిర్వహించే వారిపై ఉక్కుపాదం మోపుతామనిజిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి అన్నారు. తూర్పు ప్రాంతాల నుండి గంజాయి నంద్యాల జిల్లాకు రవాణ కాకుండా నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. మంగళవారం నంద్యాల పోలీస్ ప్రధాన కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నంద్యాల, ఆత్మకూరు, డోన్, ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లు, సర్కిల్ పోలీస్, స్టేషన్ల పోలీస్ అధికారులతో ఎస్పి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేర నియంత్రణకు, గంజాయి, పిడిఎస్ రైస్, నాటుసారా తదితర అక్రమ రవాణా కార్యకలాపాలు చేస్తున్న వారిపై ఉక్కు పాదం మోపాలంటే విజిబుల్ పోలీసింగే ప్రధాన ఆయుధమన్నారు. విజిబుల్ పోలిసింగ్‌ను ప్రతి రోజు నిర్వహిస్తే నేరాలను నివారించవచ్చన్నారు. దర్యాప్తు, విధి నిర్వహణలో అలసత్వం వహించే అధికారులు తీరు మార్చుకోలేకపోతే మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కేసుల నమోదులో ప్రతి పోలీస్ అధికారి బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. కోర్టుకు సరైన ఆధారాలు చూపి బాధితులకు తగిన న్యాయం

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి

చేసినప్పుడే పోలీస్ బాధ్యత ముగిస్తుందన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి జెవి సంతోష్, డిస్టిక్ క్రైమ్ రికార్డ్ బ్యూరో సిఐ జయరాములు, ఎస్సైలు సూర్యమౌళి, హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మారెమ్మ జాతర

- పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని, మాజీ సర్పంచి బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని జోలాపురం గ్రామంలో మారెమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. గ్రామంలో మారెమ్మ గుడి నిర్మించి విగ్రహ ప్రతిష్ట జరిగిన 41 రోజులకు జాతర నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గుండం నాగేశ్వర రెడ్డిలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్యేకు వైసిపి నాయకులు కతాల తిరుపాల్, పల్లె తిరుపతయ్య, పేరం చిన్న నరసింహుడు యాదవ్, శ్రీపతి నారాయణల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బనగానపల్లె వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, పసుపల సర్పంచి మోహన్, యాగంటి దేవస్థానం పాలకమండలి చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, వైసిపి నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి, జిల్లెళ్ల శంకర్ రెడ్డి, ఎర్రగుడి సుబ్బారెడ్డి చెర్లోకొత్తూరు మాధవరెడ్డి, మీరాపురం మనోహర్ రెడ్డి, చిన్న రాజుపాలెం పాపన్న,కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవస్థానంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

మారెమ్మకు మాజీ సర్పంచి బిసి ప్రత్యేక పూజలు

జోలాపురం గ్రామంలో జరిగిన మారెమ్మ జాతరలో పట్టణ మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి, టిడిపి నాయకులు బిసి రామనాథరెడ్డిలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు గ్రామానికి వచ్చిన బిసి రాజారెడ్డికి టిడిపి నాయకులు, మాజీ ఎంపీటీసీలు గంధం హుసేని, తలారి తిరుమలయ్య, బద్రీ నాగేశ్వరరావు, నాగరాజు యాదవ్‌ల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరు శీనయ్య, మీరాపురం బాలిరెడ్డి, పెదరాజుపాలెం భూషన్న, పసుపల బాల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి

వైసిపిలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే

టిడిపి నాయకులు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఎర్రగుడిదిన్నె గ్రామంలోని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రా రెడ్డి స్వగృహంలో చిత్రేనిపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కంచి పెద్ద నరసింహులు, లక్ష్మీనరసింహులు, ప్రసాద్, జంగం నాగరాజు, చెన్నయ్య, నాగేంద్ర, మేకల పెద్ద నరసింహులు, ప్రతాప్, మోష చెన్నయ్య బండి చంద్రతో పాటు గ్రామానికి చెందిన మరో 20 కుటుంబాలు మంగళవారం వైసిపిలో చేరారు. వీరికి ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరారన్నారు. కార్యక్రమంలో మండల జెసిఎస్ కన్వీనర్ పాణ్యం నాగేష్, నాయకులు జె.మాధవ, గుండా నరసింహయ్య శెట్టి, మాజీ సర్పంచ్ జయరాముడు, లక్ష్మీ నరసయ్య, సుబ్బారావు, బాలుడు, పెద్ద మధు, పెద్ద నరసింహులు, ఓబులేసు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఇంటిగ్రేటెడ్ శిక్షణ తరగతులు మంగళవారం మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో జరిగాయి. ఓటర్ వెరిఫికేషన్, ఆర్టిఎస్ వాట్సాప్ గ్రూప్‌ల విశిష్టతను, మన టిడిపి యాప్ ప్రత్యేకతల గురించి పార్టీ నియమించిన ట్రైనర్స్ వివరించారు. అనంతరం భూమా అఖిలప్రియ కార్యకర్తలకు, నాయకులకు దిశ, నిర్దేశాలు చేశారు. కార్యక్రమంలో భార్గవ్ రామ్, భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి, కౌన్సిలర్ హుస్సేన్ బాషా, మాజీ జెడ్పిటిసి చాంద్ బాషా, కాంట్రాక్టర్ నన్నేబాయ్ గారి జిలానీ, మెట్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల్లో భూమా అఖిలప్రియ కుటుంబంతో నాయకులు

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి : డిఇఒ

సూచనలిస్తున్న డిఇఒ సుధాకర్ రెడ్డి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

ప్రభుత్వ పాఠశాలలకు, ఆదర్శ, కేజీబీవీలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని డిఇఒ సుధాకర్ రెడ్డి సూచించారు. మంగళవారం కేజీబీవీ పాఠశాల ఆదర్శ పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని డిఇఒ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాల ఏజెన్సీలో మెనూ ప్రకారం భోజనాలు తయారు చేయాలని ఆదేశించారు. కెజిబివిలో డార్మెట్రీ అపరిశుభ్రంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డిఇఒ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మోహన్ రెడ్డి, సీఆర్పీలు అజ్మత్, రాజశేఖర్, తదితరులు కోరారు.

మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలి : ఐద్వా

మాట్లాడుతున్న మహిళా నాయకురాలు షాజిదాబి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

మహిళలకు చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా నాయకురాలు షాజిదాబి డిమాండ్ చేశారు. మంగళవారం వారు స్థానిక సిపిఎం కార్యాలయంలో మాట్లాడుతూ చట్టసభల్లో మహిళా రిజర్వేషన్‌పై అధికా రంలో వచ్చిన పాలక ప్రభుత్వాలు ఎన్నికలలో వాగ్దానం చేస్తున్నారే తప్ప ఆచరణలో అమలు చేయడం లేదని అన్నారు. మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసం దిశ యాప్ ను ప్రవేశపెట్టినప్పటికీ అఘాయిత్యాలు ఆగడం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు సాజిదాబి, సోడా బిబి, రంగమ్మ , నౌషాని తదితరులు పాల్గొన్నారు.

కేసి కెనాల్ ఆయకట్టులో
వరి సాగు చేయొద్దు : ఏడిఎ

రైతులతో మాట్లాడుతున్న ఏడిఎ

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని కేసీ కెనాల్ ఆయకట్టు పరిధిలో రైతులు తొందరపడి వరి నారుమడులు వేసుకోవద్దని ఆత్మకూరు ఏడిఏ ఆంజనేయ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తుంగభద్ర శ్రీశైలం జలాశయాల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున కలెక్టర్ గారి ఆదేశాల మేరకు రైతులు సమన్వయం పాటించి వరి నారుమడులు వేసుకోవద్దని ఆయన తెలిపారు. గ్రామాల్లో యంత్ర సేవా పథకంలో భాగంగా తక్కువ ధరలో రైతులు పొలం సాగు చేయించుకొని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం జూటూరు తుమ్మలూరు రుద్రవరం గ్రామాలలో ఆర్బికే కేంద్రాలను తనిఖీ చేశారు. రైతులకు విత్తనాలు ఎరువులను అందుబాటులో ఉంచాలని సూచించారు. పంటలపై చీడపీడలపై రైతులతో ముఖాముఖి చర్చించారు.

సిసి రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి -ప్యాపిలి

పట్టణంలోని చెన్నకేశవ దేవాలయం దగ్గర 3వ వార్డు నందు 10 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల పనులకు జడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, సింగిల్ విండో చైర్మన్ బోరెడ్డి రాము, కృష్ణారెడ్డి మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సంద్బంగా వారు మాట్లాడుతూ మండల నిధుల నుంచి గతంలో ఇచ్చిన హామీలలో భాగంగా రోడ్లు వేయడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, నిజాముద్దీన్, శ్రీనివాసులు, పెద్దిరాజు పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న జెడ్పిటిసి బోరెడ్డి శ్రీరామారెడ్డి

ప్రజల కోసమే జగనన్న సురక్ష : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

ప్రజల కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల మండలం పోలూరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని 548 మందికి కావాల్సిన ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, నంద్యాల మండల కన్వీనర్ బసవేశ్వర రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మన్న, గ్రామ సర్పంచ్ ప్రతాప్, వైస్ సర్పంచ్ బాలచంద్రారెడ్డి, మునగాల సర్పంచ్ లోకేశ్వర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సిద్ధం శివరాం, వైసిపి నాయకులు నాగేశ్వర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి సాయిరాం రెడ్డి, గ్రామ నాయకులు, అధికారులు, వాలంటరీలు పాల్గొన్నారు. **రుద్రవరం :** అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని గ్రామ సర్పంచ్ బైరి విజయలక్ష్మి అన్నారు. స్థానిక సంత మార్కెట్ ఆవరణంలో ఎంపీడీవో మధుసూదనరెడ్డి, తహశీల్దార్ రవీంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో మూడవ సచివాలయం సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 275 ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. పంచాయతీరాజ్ ఏఈ వెంకటరాముడు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్, ఏవో శ్రీకృష్ణ, రెండవ ఎంఈఓ లక్ష్మి, వెలుగు ఏపిఎం కల్పలత పాల్గొన్నారు. **మహానంది :** మహానంది మండలం గాజులపల్లి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పాల్గొన్నారు. అనంతరం అర్హులైన కొందరికి ధ్రువపత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డా రెడ్డి యశస్విని, తహసిల్దార్ జనార్ధన్ శెట్టి, ఎంపీడీవో శివ నాగ జ్యోతి, గాజులపల్లె వైసీపీ నాయకుడు మసూదన్ రెడ్డి, సర్పంచ్ చంటి తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతాయని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మంగళవారం సంత జూటూరు గ్రామంలో వైసిపి నాయకులు, సహకార సంఘం ఉపాధ్యక్షులు శివశంకర్, డి మౌలాలి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామ స్వరాజ్యం స్థాపించే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి, తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పరమేశ్వరి, ఎంపిపి దేరేడి చిన్న సంజీవరెడ్డి, జడ్పిటిసి సభ్యురాలు బారెడ్డి తులసమ్మ, మాజీ ఎంపిపి దేసు వెంకటరామిరెడ్డి, తాసిల్దార్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు. **వెలుగోడు:** సమయపాలన పాటించని వాలంటరీలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఎంపీడీవో అమానుల్లాను ఆదేశించారు. మంగళవారం ఆయన జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. అనంతరం పట్టణ వికలాంగుల అధ్యక్షులు అబ్దుల్ రావుఫ్ వారి సమస్యలను తెలిపారు. నాయకులు శిల్పా భువనేశ్వర రెడ్డి, దేశం తిరుపం రెడ్డి, అంబాల ప్రభాకర్ రెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. **మిడుతూరు:** చౌట్కూర్ గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష క్యాంపులో ఎంపిడిఒ నాగ శేషాచల రెడ్డి, తహశీల్దార్ ప్రకాష్ బాబు, ఇఒఆర్‌డి ఫక్రుద్దీన్, సర్పంచికొట్టాల మదార్ సాహెబ్, ఎంపిటిసి శ్రీమతి ఫరీద చౌత్కూర్, 49 బన్నూర్ సర్పంచి శ్రీమతి భూదేవి, లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కళ్యాణ్ సింగ్, బీజాన్ బి, తదితరులు పాల్గొన్నారు. **బేతంచర్ల:** ఉచిత సేవలను అందించడమే జగనన్న సురక్ష లక్ష్యం అని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం అంబాపురం గ్రామంలో నిర్వహించారు. ఈ ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా 11 రకాలైన ధృవపత్రాలను ఉచితంగా అందించడం జరుగుతోందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గతంలో మండల కేంద్రాల చుట్టూ పనులు మానుకొని తిరిగిన ఎన్నో రోజులు పట్టేదని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, గూని నాగరాజు, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మురళీకృష్ణ, గోరుమాల కొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, బీరేలి నాగేశ్వర్ రెడ్డి, గుమ్మగాళ్ల రాజు, వెంకటేశ్వర్లు రామానాయుడు తదితరులు పాల్గొన్నారు. **పగిడ్యాల :** మండలంలోని కొత్త ముచ్చుమర్రి గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలను సర్పంచి రాధమ్మ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, తహశీల్దార్ భారతి, ఇఒఆర్‌డి నాగేంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు. **గడివేముల :** మండలంలోని కొరట మద్ది గ్రామంలో జగనన్న సురక్షలో సర్పంచ్ నాగేశ్వర్ రెడ్డి 320 మందికి వివిధ రకాల సర్టిపికెట్లను అందజేసారు. కార్యక్రమంలో, ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప, ఈఓఆర్డి ఖాళిక్ బాషా, తదితరులు పాల్గొన్నారు. **డోన్ :** జగనన్న సురక్ష పథకం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. నెహ్రూ నగర్ సచివాలయం నందు నిర్వహించిన సురక్ష క్యాంపులో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ధృవపత్రాలను అందజేశారు. వైస్ చైర్మన్ ఎస్ఎండి జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్ మిట్టా ఉమామహేశ్వరి, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధ్రువ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

బండి ఆత్మకూర్ : ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

మంత్రి రోజాపై కేసు నమోదు చేయాలి

మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

- ప్రజా సంఘాల నాయకులు డిమాండ్

ప్రజాశక్తి - నందికొట్కూరు

దళిత ప్రజాప్రతినిధిని అడగడున అవమానాలకు గురిచేస్తూ అగౌరపరిచే అగ్రవర్ణాల పెత్తనం సహించేదే లేదని మంత్రి రోజాపై తక్షణమే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత ప్రజా సంఘాల నాయకులు త్యాగరాజు, మాల మహానాడు సీనియర్ నాయకులు రాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు డాక్టర్ రాజు, వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోనే స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎమ్మెల్యే ఆర్థర్ ను పిలవ కుండా అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి మంత్రి రోజా పాల్గొ నడంపై ఎమ్మెల్యేను అవమానించారంటూ దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో చేపట్టారు.

దళిత ప్రజా సంఘాల నాయకులు త్యాగరాజు, మాల మహానాడు సీనియర్ నాయకులు రాజు, వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకట రమణ, సింగిల్ విండో చైర్మన్ సగినేల ఉషనయ్య, మహిళ అధ్యక్షురాలు డాక్టర్ వనజ, ఎమ్మార్పీఎస్ నాయకులు డాక్టర్ రాజు మాట్లాడుతూ మంత్రి రోజా పర్యటనలో స్థానిక ఎమ్మెల్యేను అవమాన పరిచారని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళితుల పట్ల ఆమె వ్యవహార శైలి దళితుల మనోహభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని, తక్షణమే మంత్రి రోజాను పార్టీ పదవులలో నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలను చేపడుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత వివిధ ప్రజా సంఘాల నాయకులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితులపై అడుగడుగునా వివక్ష : మాల మహానాడు

కొత్తపల్లి : ప్రోటోకాల్ పాటించని వారిపై సిఎం చర్యలు తీసుకోవాలని మాల మహానాడు నాయకులు కదిరి సుబ్బన్న, గనముల పరశురాముడు, కిరణ్ ప్రసాద్, దాసు కోరారు. మంగళవారం కొత్తపల్లిలోని అంబేద్కర్ విగ్రహం ముందు వారు మాటాడ్లాడారు. వివక్షత చూపిన వారిపై తగిన చర్యలు తీసుకోక పోతే ఈ విషయాల పై జాతీయ ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకునిపోతామని అన్నారు.

ఎమ్మెల్యేను పిలవకపోవడం సిగ్గుచేటు

పాములపాడు : ఇండోర్ స్టేడియం ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆర్థర్‌ను పిలవకపోవడం సిగ్గుచేటైన విషయమని పాములపాడు వైసిపి మండల నాయకులు ఎం. రమణారెడ్డి, జూటూరు మధు, కోఆప్షన్‌మెంబర్ ముర్తుజావలీ అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ మంత్రి రోజా తన నియోజకవర్గంలోని నగరిలో ఓ ప్రైవేట్ షాప్‌ను ప్రారంభించేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వస్తే బాధపడిన మీరు.. నందికొట్కూరు నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే లేకుండా ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. సర్పంచ్ మౌలాలి మాలిక్, బాష, అంబన్న, షేక్షావలి, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐ కు వినతి పత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

విఆర్ఏల రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి -ప్యాపిలి

వీఆర్ఏల సమస్యల పరిష్కారానికై ఈనెల 20,21న జరుగుతున్న రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.శివరాం, మండల కార్యదర్శి ఎస్.ఏ.చిన్న రెహమాన్, ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఓబులేసు, రామనాయుడు వీఆర్ఏలకు సూచించారు. ఈమేరకు మంగళవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ఆర్ఐ సుధాకర్ రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి విఆర్ఎలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మస్తాన్,శ్రీను,శివ,కర్ణాకర్, ప్రతాప్, మల్లి కార్జున,భూపాల్, సుంకన్న,రాజు, సుంకులమ్మ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఎల్‌డిఒ

సురక్షకు అధికారులు హాజరు కావాలి

ప్రజాశక్తి - చాగలమర్రి

సురక్ష కార్యక్రమానికి మండల అధికారులు అందరూ తప్పక హాజరు కావాలని లేకుంటే షోకాజు నోటీసులు తప్పవని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి జనార్దన్ రావు, ఎక్సైజ్ సూపరిటెంట్ రవికుమార్ రెడ్డిలు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని మద్దూరు సచివాలయం వద్ద తహసిల్దార్ సుభద్రమ్మ ఆధ్వర్యంలో జరుగుతున్న మద్దూరు,బ్రాహ్మణ పల్లె గ్రామాల జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, బ్రాహ్మణపల్లె సర్పంచ్ నేట్ల మహేశ్వరి, అధికారులు 357 మందికి వివిధ రకాల సేవా సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో రంగ నేతాజీ, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీలమ్మ,ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నరసింహ్మారెడ్డి, ఏపీవో నిర్మల, పంచాయతీ కార్యదర్శి స్వర్ణకుమార్ ,సచివాలయ సిబ్బంది వైసిపి నాయకులు శ్రీనివాస్ రెడ్డి సాల్మన్ షరీఫ్ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్ జయసింహా రెడ్డి

సైనిక్ స్కూల్‌కి
మేఘన కోచింగ్ సెంటర్ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ ఏడాది జనవరిలో జరిగిన సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ ఫలితాలలో మేఘన కోచింగ్ సెంటర్ విద్యార్థి ఎం రఘుధర్మ కేరళలోని వేదవ్యాస సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యారు. అలాగే నవోదయ స్కూల్‌కి ముగ్గురు విద్యార్థులు సెలెక్ట్ అయినట్లు కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జయసింహా రెడ్డి తెలిపారు. మంగళవారం కోచింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ర్యాంకు సాధించిన విద్యార్థికి ఆయన బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి తమ విద్యార్థులు 5 నుంచి 6 మంది సైనిక్, నవోదయ స్కూల్‌కు సెలెక్ట్ అవుతున్నారని చెప్పారు. ఈ సదావకాశాన్ని ప్రతి విద్యార్థి ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు. ర్యాంకులు సాధించడానికి కృషి చేసిన అధ్యాపక బృందం శివ, శ్రీకాంత్, కళ్యాణ్, గిరిబాబు, అబ్దుల్లాలను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మహానంది

మండలంలోని గాజులపల్లి ఆర్ఎస్ గ్రామానికి చెందిన అలగాని వెంకటేశ్వర్లు (45) మంగళవారం ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడు. వివరాలు.. అలగాని వెంకటేశ్వర్లు తన ఇంటి వద్ద కరెంటు సప్లై లేదని ఎవరూ చెప్పిన వినిపించుకోకుండా స్తంభం ఎక్కాడు. ప్రమాదవశాత్తు లెవెన్ కెవి తీగలు తగిలి కింద పడ్డాడు. స్థానికులు వెంటనే అతన్ని ఆంబులెన్స్‌లో నంద్యాలకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు : టిడిపి

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమరి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్యం పడకేసిందని, పాలకులు,అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని టిడిపి రాష్ట్ర రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు అన్సర్ బాషా విమర్శి ంచారు. మంగళవారం చాగలమరి పట్టణంలోని ముత్యాలపాడు బస్టాండ్ లో గత వారం రోజులుగా రోడ్డుపై ప్రవహిస్తున్న మురికినీటిలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పాలకులు గానీ అధికారులు గాని గత వారం రోజుల నుండి ప్రధాన రహదారిలో నీళ్లు నిలిచి కంపు కొడుతున్న పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. అహోబిలం కు వెళ్లే ప్రధాన రహదారి అయిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. విద్యార్థులు, ప్రజలు ముక్కులు మూసుకుని వెళ్లవలసిన దౌర్భాగ్యస్థితి నెలకుందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసిం హులు, నంద్యాల జిల్లా బీసీ సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు, టిడిపి నాయకులు హనీఫ్, మాబు లాల్, బీసీ సంఘం అధ్యక్షులు లక్ష్మీనా రాయణ గౌడ్ రామతీర్థం,గఫార్, షాబుల్, జెట్టి నాగరాజు, మౌలాలి నాగూర్, ఖాజా రసూల్,షరీఫ్, మధు, కామిశెట్టి రమేష్ గఫార్, అజీమ్, నూర్ భాష,షబ్బీర్, రాజేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మురికి నీటిలో ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు

జర్నలిస్టులపై దాడులు హేయమైన చర్య

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

జర్నలిస్టులపై దాడులు హేయమైన చర్య అని, దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర సభ్యులు నిజాముద్దీన్, తాలూకా అధ్యక్షులు కరణం శ్రీనివాసరావు, కోశాధికారి నాగరాజు, తాలూకా గౌరవ అధ్యక్షుడు సుబ్బారావు డిమాండ్ చేశారు. మహానంది మండల వార్త విలేకరి మధుపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద శాంతియుత నిరసన తెలియజేశారు. అనంతరం తహశీల్దార్ హరినాధ రావుకు, పట్టణ సిఐ రమేష్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టులపై దాడులు ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జర్నలిస్టులపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు ఖాశిం వలి, ప్యాపిలి ప్రసాద్, అక్షింతల శ్రీనివాసులు, అరుణ్, మహమ్మద్ హుస్సేన్, డిడి-8 భాష, జనం దాసు తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** నిజాలను నిర్భయంగా రాసే మహానంది మండల విలేకరి మధుపై దాడి హేయమైన చర్య అని, వైసిపి నాయకులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని శ్రీశైలం నియోజక వర్గం తెలుగు దేశం పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శి నాగరత్నం డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అధికార గర్వంతో వైసిపి నాయకులు విలేకర్లపై దాడుల చేయడం సిగ్గు చేటని అన్నారు. పాత్రికేయుడికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎరుకల సంఘం మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు కావేటి శ్రీనివాసులు, నాయకులు దుబ్బ శ్రీను, రాజు, నాగన్న, యేసు, డేవిడ్,బెంజిన్న తదితరులు పాల్గొన్నారు. **గడివేముల:** వార్త విలేకరి మధుపై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని ఏపీయూడబ్ల్యూజే, ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ సర్కిల్లో విలేకరులు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి ఏఎస్ఐకు వినతి పత్రం అందజేశారు. తాసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఎల్లాసుబ్బయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయుడు, ఏపీయూడబ్ల్యూజేఎఫ్ పాణ్యం నియోజవర్గ ఉపాధ్యక్షుడు మహబూబ్ బాషా, శ్యాంసుందర్ రెడ్డి, ఎల్లసుబ్బయ్య, మహమ్మద్ సలేహా, మహేష్ బాబు, అరుణ్ భాష, మస్తాన్, రఫీ, రాజేష్, లీవికుమార్, రాముడు, చెన్నయ్య పాల్గొన్నారు.

సిఐ రమేష్ బాబుకు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

వైసిపితో భవిష్యత్తుకు గ్యారెంటీ లేదు : టిడిపి

భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నందికొట్కూరు

వైసీపీ ప్రభుత్వంలో ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ లేదని రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు టిడిపితోనే సాధ్యమని నందికొట్కూరు నియోజకవర్గ అసెంబ్లీ ఇంచార్జ్ జయసూర్య అన్నారు. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నందికొట్కూరు పట్టణంలోని ఐదవ వార్డులో జయసూర్య పర్యటించి, ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి ముత్తుజావలి, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షకీల్ అహ్మద్, కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి, మద్దిలేటి, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బి.రాజన్న, శ్రీనివాసులు టిడిపి నాయకులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** టిడిపితోనే ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు సాధికారత దక్కిందని మాజీ మంత్రి, రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి భూమా అఖిలప్రియ అన్నారు. నగళ్ళపాడు గ్రామంలో మంగళవారం మహిళల భవిష్యతుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలోరాష్ట్ర ముస్లిం మైనారిటీ ఉపాధ్యక్షుడు, ఎంఎస్అన్సర్ బాష, మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, జిల్లా తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ స్పోక్ పర్సన్ చల్ల నాగరాజు యాదవ్, ఆళ్లగడ్డ నియోజకవర్గం ఐ టీడీపీ ఉపాధ్యక్షురాలు శజ్జరెడ్డి పెద్ద దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - ఆత్మకూర్

మండలంలోని, మానవతా నిలయం వృద్ధాశ్రమంలో మంగళవారం నాడు హెల్పింగ్ హాండ్స్ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హాండ్స్ యూత్ అధ్యక్షుడు మున్వర్ బాష మాట్లాడుతూ అనాధ ఆశ్రమములలో, వృద్ధాశ్రమాలలో, ఫుట్‌పాత్‌ల మీద నివసించే బిచ్చగాళ్లకు, వికలాంగుల, బధిరుల పాఠశా లలో, రంజాన్ నెలలో ఉపవాసాలు ఉండే వారికి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ అన్నదాన కార్యక్రమములో ఆశ్రమానికి ఒక బియ్యం బస్తా దానం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ యూత్ నాయకులు లోకేష్, షేక్.అహ్మద్, ఇమామ్ సాబ్, మనవర్, రాజ్ కుమార్, ఇమ్రాన్, అజ్మతుల్లా, మాస్టర్ హరికృష్ణ, ముర్తుజా వలి, మండ్లేం గ్రామ అజ్మతుల్లా, మహబూబాషా పాలొన్నారు.

వినియోగదారులపై బ్యాంక్ మేనేజర్ దురుసు

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి మండల పరిధిలోని ముత్యాలపాడు బ్యాంక్ మేనేజర్ వినియోగదారులపై దురుసుగా ప్రవర్తించడం తో మంగళవారం ఆందోళన చేపట్టారు. వివరాల మేరకు ముత్యాలపాడు ఎస్బిఐ బ్యాంకు మేనేజర్ రమేష్ కుమార్, బ్యాంకులో లావాదేవీల కోసం, రుణాలు చెల్లింపులకు వచ్చిన వినియోగదారులపై అసభ్యకరమైన పదజాలంతో మాట్లాడుతు ఉండడంతో తోడేళ్లపల్లె, ముత్యాలపాడు గ్రామానికి చెందిన రైతులు, పొదుపు మహిళలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా చాగలమర్రి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు వీరభద్రుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను, రైతు భరోసా, చేయూత, పొదుపు మహిళల సంబంధించిన నిధులను ఇవ్వకుండా ఇష్టానుసారంగా వ్యవహరి ంచుతున్నారన్నారు. పునరావతం కాకుండా చూసుకోవాలని ఆయన అన్నారు.

26న విద్యుత్ ఉద్యోగుల సదస్సు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

ఈనెల 26న విజయవాడలో విద్యుత్ ఉద్యోగుల పిఆర్సి, కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణ, తదితర అంశాలపై నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని స్ట్రగుల్ కమిటీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం నాయకులు టి.వెంకట్, ఏ.శంకర్‌ల నాయకత్వంలో సుండిపెంట ఏపీ ట్రాన్స్కో ఆఫీస్ ముందు కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కె. నాగిరెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు డి.ఓబులయ్య మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా విద్యుత్ ఉద్యోగులకు పిఆర్సిని ఇచ్చి, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు టి .శివరాముడు, వర్కింగ్ ప్రెసిడెంట్ ధనరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేశ్వర్లు,మహేష్, టి.రాము ,అంజి, రాజమ్మ, బాబురావు, బాలు నాయక్, రవికుమార్ ఎం. నాగరాజు, ఎస్.కే.బాష తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణంలోని ఆదిత్య కళాశాల ప్రాంగణంలో ఉచిత మెడికల్ క్యాంప్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పస్పిల్ మున్నా మాట్లాడుతూ డాక్టర్లు ప్రజలకు అన్ని వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగిందన్నారు. దాదాపుగా 400 మంది క్యాంపులో పాల్గొని ఉచితంగా మందులు తీసుకొని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, శాంతిరామ్ హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ విజయ్ భాస్కర్ నాయుడు, తెలుగునాడు విద్యార్థి సంఘం నాయకుడు ఫారూఖ్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విద్యార్థులకు స్టేషనరీ వితరణ

ప్రజాశక్తి - గడివేముల

నంద్యాల జిల్లా రోటరీ క్లబ్ అధ్యక్షులు కరుణామయ విద్యాసంస్థల చైర్మన్ దండే దస్తగిరి దంపతుల ఆర్థిక సహకారంతో మండలంలోని ఎల్‌కె తండాలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, స్కూలుకు సంబంధించిన స్టేషనరీని అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు దండే దస్తగిరి మాట్లాడుతూ నోట్ పుస్తకాలను, పలకలను, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సర్పంచ్ బిలావత్ కారు నాయక్ మాట్లాడుతూ చదువుకు సంబంధించిన వస్తువులు అందజేయడం హర్షణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ మెంబర్లు మునగాల మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, లాయర్ అశోక్ రెడ్డి, సుధ ప్రసాద్ రెడ్డి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ వితరణ

వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఇంటి పట్టాలు ఇవ్వాలి : ఐఎఫ్టియు

ప్రజాశక్తి - శ్రీశైలం

మాణిక్యమ్మ శెల చెంచు గిరిజనులకు ఇంటి పట్టాలు ఇవ్వాలని ఆత్మకూరు డిఎఫ్ఓకు ఐఎఫ్టియు ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదం మంగళవారం నాడు డిఎఫ్ఓ కార్యాలయంలో కలసి వినతి పత్రం అందజేశారు. శ్రీశైలం పరిధిలో మాణిక్యమ్మ శెల చెంచుగూడెంలో 30 చెంచు గిరిజన కుటుంబాలు చెంచు 1999 నుండి ఇక్కడ నివాసం ఉంటున్నారని, ప్రభుత్వం వారికి ఆధార్ కార్డు, రేషన్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, కరెంటు సదుపాయాలు ఏర్పాటు చేశారన్నారు. వీరికి ఇప్పటివరకు ఇంటి పట్టాలు మంజూరు చేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డిఎఫ్ఓను కలిసిన వారిలో పిడిఎస్‌యు ఉపాధ్యక్షులు జిని బాషా తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియం చేసుకోవాలి

ప్రజాశక్తి - పాములపాడు

ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో గోపికృష్ణ, తహశీల్దార్ రత్న రాధిక సూచించారు. మంగళవారం ఇస్కాల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలపై వాలంటీర్ల ద్వారా సర్వే చేయించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందే విధంగా చూడడమే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశం అన్నారు. అనంతరం ఎంపీపీ సరోజినీ వర్జినియాతో కలిసి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మౌలాలి, ఏవో పనిశ్వర్ రెడ్డి, ఏపీవో విమలమ్మ, నాయకులు మాలిక్ బాషా, అమ్మన్న, తదితరులు పాల్గొన్నారు.